

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## జిల్లాలో మొట్టమొదటి పీజిఆర్ఎస్ అర్జీని స్వీకరించిన కలెక్టర్

- నా కుమారుడు ఇంటి నుంచి గెంటి వేశాడు న్యాయం చేయండి
- తక్షణం న్యాయం చేస్తామని మానవత్వంతో స్పందించిన కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలమూరు నుండి అనేకమంది సమస్యలు జిల్లా కలెక్టర్‌కు చెప్పుకొని ష్కరించాలని కలెక్టర్ కార్యాలయానికి పెద్ద ఎత్తున వస్తున్న అర్జీదారులలో కావలికి చెందిన రమా జ్యోతి అనే వృద్ధురాలు నడవలేని స్థితిలో కింద కూర్చొని ఉండగా అటుగా వెళుతున్న కలెక్టర్ గమనించి నేరుగా ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొట్టమొదటి అర్జీని ఆమె వద్ద నుండి స్వీకరించారు. ఆమె పెద్ద కొడుకు తనను మభ్యపెట్టి నివసిస్తున్న ఇంటిని తన పేరు మీద రాయించుకుని నన్ను ఇంటి నుంచి వెళ్ళగొట్టాడు. అని అనేక ఇబ్బందులు పడుతున్నాను. నిలువ నీడ లేకుండా చేశాడు అని.. అయ్యా నన్ను మభ్యపెట్టి రాయించుకున్న ఇంటి రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసి నాకు న్యాయం చేయాలని, కలెక్టర్‌కు మొరపెట్టుకుంది. తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు పిలిచి ఆమెకు వెంటనే న్యాయం చేయాలని అధికారులను సూచించారు. కలెక్టర్ స్వయంగా ఆమె వద్దకు వచ్చి అర్జీ తీసుకున్న విధానాన్ని అక్కడ వాళ్ళని అందరి హృదయాలని కలిచి వేసింది.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 35847 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 72.250 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 250, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.795 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## అర్జీలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారి విజయకుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహ ణ అధికారి మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపుతూ తక్షణమే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో హరసత్వం వహించరాదని ఆయన తెలిపారు.

**పరిష్కార వేదికలో మొత్తం 524 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 524 అర్జీలు రాగా అందులో అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 180, పోలీస్ శాఖకు సంబంధించి 120, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 46, నగరపాలక సంస్థకు సంబంధించి46, మరియు సర్వేనెంబర్ రికార్డుకు సంబంధించి 37 దరఖాస్తులు రాగా వివిధ శాఖలకు సంబంధించి మిగిలినవి ఉన్నాయి. దళిత జిల్లా కలెక్టర్ ప్రజా ఫిర్యాదులకు వస్తున్న అర్జీ దారులుకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అర్జీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.

## జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు

- 46వ నెల్లూరు జిల్లా జేసీగా ఎం వెంకటేశ్వర్లు బాధ్యతలు
- జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా - జిల్లా అదనపు మెజిస్ట్రేట్ ఎం వెంకటేశ్వర్లు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు, జిల్లాలోని ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడతానని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. నూతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు కలెక్టరేట్లోని వారి చాంబర్లో వేద పండితుల ఆశీర్వచనాలతో ఉదయం 10:20 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ పుష్పగుచ్చంతో ఆహ్వానం పలికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన జెసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో జిల్లాలో తహసిల్దారుగా పనిచేసిన అనుభవం ఉందని, నిబంధన మేరకు పనిచేస్తూ, ఎటువంటి ఫైల్స్ పెండింగ్లో ఉండకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు పాటిస్తూ, జిల్లాలోని మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణల నేపథ్యంలో నెల్లూరు నగరంలో అవగాహన కార్యక్రమం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో ప్రజలకు, చిరు వ్యాపారస్తులకు, దుకాణదారులకు అవగాహన కల్పించిన టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి
- పండగపూట పసందైన మాట - జీఎస్టీ 2.0తో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



**నెల్లూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేద మధ్య తరగతి వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 సంస్కరణలతో దేశ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని నెల్లూరు జిల్లా టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. నేటి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 నేపథ్యంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో కేతంరెడ్డి వినోద్‌రెడ్డి నగరంలోని ములుమూడి బస్టాండ్ సెంటర్లో స్థానిక ప్రజలకు, చిరు వ్యాపారులకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి దుకాణానికి తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నేటి నుంచి దేశ వ్యాప్తంగా జీఎస్టీ బచత్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. నవరాత్రుల ప్రారంభం రోజు నుంచే జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి తేవడం ఎన్డీఏ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. గతంలో ఉన్న పన్ను విధానం సంక్లిష్టంగా ఉండేదని, ఆ చిక్కు ముడులను తొలగిస్తూ 2017 లో నాటి ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. తిరిగి 2025 లో జీఎస్టీలో సంస్కరణ చేస్తూ నాలుగు స్లాబులను రెండు స్లాబ్‌లకు తగ్గించి సామాన్య, పేద ప్రజలకు ఎంతో ఊరట కలిగించారన్నారు. ప్రతి ఇంటికి జీఎస్టీ ప్రతిఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి, సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికి జీఎస్టీ సంస్కరణల అమలుకు సంపూర్ణ మద్దతు తెలియజేసిన కూటమి ప్రభుత్వంప ప్రశంసలు కురిపించారు. సామాన్య ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నిత్యవసర సరుకులలో 47 శాతం వస్తువులను జీఎస్టీ నుంచి మినహాయించడం గొప్ప విషయం అన్నారు. నిత్యం ప్రజలు ఉపయోగించే సబ్బు, షాంపులు, బ్రష్, పేస్ట్ చీపురు, పప్పు, ఉప్పు, పెన్నులు, పెన్సిళ్లు వంటి నిత్యవసరాలపై పన్ను మినహాయింపుతో ప్రతి కుటుంబానికి నెలకు 5 వేల నుంచి 20 వేల వరకు పొదుపు అవుతుందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు కూడా దీని అర్థం చేసుకొని ఎన్డీఏ ఆధ్వర్యంలో తమకు జరిగే మేలును వివరించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఇంటి నిర్మాణానికి ఇటుక ఇటుక పేర్చినట్లు దేశ ఆర్థిక రంగ బలోపేతానికి సంస్కరణలు అమలు చేస్తున్న నిజమైన నాయకులు ప్రధాని మోడీ అని చెప్పారు. గతంలో 2 లక్షలు ఆదాయం ఉన్నా ఆదాయపన్ను విధించే వారని, కానీ నేడు సంవత్సరానికి 12 లక్షల ఆదాయం ఉన్నా ఇన్కమ్ టాక్స్ లేదన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం పురోగమిస్తోందని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సారధ్యంలో నెల్లూరు జిల్లా అభివృద్ధిలో ముందుకెళ్తుందన్నారు. ఎంపీ సహకారంతో ఇప్పటికే జిల్లాలో పలు ప్రాజెక్టులకు నిధులు సమకూరాలని మరిన్ని ప్రాజెక్టులు తెచ్చేందుకు ఎంపీ వేమిరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజా సేవ చేస్తూ వందలాది మందికి ట్రై సైకిళ్లు అందించారని, త్వరలోనే వీపీఆర్ నేత్ర ద్వారా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించనున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ కూడా కూటమి ప్రభుత్వానికి తమ మద్దతు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దు సుబ్బారెడ్డి, ఎల్సీ రమణారెడ్డి, సాయి కృష్ణారెడ్డి, కనకేశ్వరరావు, జాన్ డేవిడ్, ఉడాలి సూర్యనారాయణ, వినయ్, కుక్క ప్రభాకర్, సుభాని, సియోన్, మహిళా నాయకులు శిరీష రెడ్డి, ఝాన్సీ, భార్గవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే జూన్ నెలఖరు లోపు 2,61,640 టిడ్కో ఇళ్లను పూర్తి చేసేలా ముందుకెళ్తున్నాం

- మొత్తం ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతులకు, కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలకు కలిపి 7280 కోట్లు అవసరం
- గత ప్రభుత్వం 4,39,841 ఇళ్లను రద్దు చేసేసింది
- గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో అనేక అవకతవకలకు పాల్పడింది
- ఇళ్లు ఇవ్వకుండానే లబ్దిదారుల పేరుమీద బ్యాంకు లోన్‌లు తీసుకుంది
- అసెంబ్లీలో టిక్కో ఇళ్లపై ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానం



**నెల్లూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త - వైద్యం** గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో అనేక అవకతవకలకు పాల్పడిందని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు. వచ్చే నెలాఖరు లోపు టిడ్కో ఇళ్లను పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల పరిస్థితి లబ్దిదారులకు ఇళ్ల అప్పగింతపై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. 2014-2019 లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 7,01,481 ఇళ్లను కేటాయించిందన్నారు. వీటిలో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లు కూడా పిలిచి పనులు ప్రారంభించామన్నారు. అయితే గత ప్రభుత్వం ఈ 5 లక్షల ఇళ్లను 2,61,640కు తగ్గించేసింది. అంటే మొత్తం 4,39,841 ఇళ్లను రుద్ద చేసేసిందన్నారు. ఈ ఇళ్లను కూడా పూర్తి చేయలేదు. అత్యాధునిక షీర్ వాల్ టెక్నాలజీతో ఇంటి సామాగ్రి కూడా అత్యాధునికమైన నాణ్యమైనది వాడేలా అన్ని వసతులు, పార్కులు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు, హాస్పిటల్ వంటివి కూడా నిర్మించేలా డిజైన్ చేశాం. కానీ గత ప్రభుత్వం వాటన్నింటిని నాశనం చేసింది. 2019 మే నాటికి 77,350 ఇళ్లను 90 నుంచి 100 శాతం పూర్తి చేసేశాం, కానీ గత ప్రభుత్వం ఇళ్లను పూర్తి చేసినా ఎక్కడా మౌలిక వసతులు మాత్రం కల్పించలేదన్నారు. 103 యూఎల్‌బీలలో పనులు ప్రారంభిస్తే గత ప్రభుత్వం 88 యూఎల్‌బీలకు పరిమితం చేసి 15 వేల ఇళ్లను పూర్తిగా తొలగించేసింది. కేవలం 1,77,546 ఇళ్లు పూర్తి కాగా 84,094 ఇళ్లు నిర్మాణం జరుగుతున్నాయి. గత ప్రభుత్వం నిధుల విషయలో కూడా జీవోలు ఇచ్చింది తప్ప. డబ్బులు ఇవ్వలేదు.. లబ్దిదారుల వాటా తగినంచామని చెప్పి జీవోలు ఇచ్చారు తప్ప నిధులు ఎక్కడా విడుదల చేయలేదు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 3100 కోట్లు ఇవ్వలేదు. మిగిలిన ఇళ్లు, ఇన్‌ఫ్రా కోసం 3302 కోట్లు అవసరం. మొత్తంగా ప్రాజెక్టు పూర్తికి 7380 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి హడ్కో నుంచి 4450 కోట్లు రుణం తీసుకుంటున్నాం.. లబ్దిదారులకు ఇచ్చే ఇళ్ల మీద రుణాలు 1725 కోట్లు తీసుకుంటున్నాం.. అమృత్ పథకం నిధులు 225 కోట్లు ఖర్చు పెట్టేలా మొత్తం ప్రాజెక్టు డిజైన్ చేశాం. మరో 818 కోట్లు వివిధ రూపాల్లో తీసుకునే ఆలోచనలో ఉన్నాం. 2014-19లో ఎంపిక చేసిన లబ్దిదారుల్లో 52,192 మందిని అనర్హులుగా ప్రకటించి వారికి ఇళ్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించకుండానే లబ్దిదారుల పేరు మీద లోన్‌లు తీసుకుందని మంత్రి చెప్పారు. దీంతో బ్యాంకుల నుంచి లబ్దిదారులకు ఒత్తిడి రావడంతో 140 కోట్లను ఈ ప్రభుత్వం చెల్లించింది. ఇళ్లకు అప్పటికే రంగులు వేసినప్పటికి గత ప్రభుత్వం పార్టీ రంగులు వేసుకుందని, దీనికి సంబంధించి కూడా కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వలేదన్నారు. ఇక ప్రతి నెల కట్టాల్సిన 6 కోట్ల రూపాయలను కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మొత్తంగా వచ్చే జూన్ నాటికి 2,61,640 ఇళ్లను పూర్తి చేసి అన్ని మౌలిక వసతులు కల్పించేలా ముందుకెళ్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇళ్లు పూర్తయ్యేచోట ప్రతి శనివారం లబ్దిదారులకు ఇళ్లు కేటాయించాలని మున్సిపల్ కమీషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి నారాయణ చెప్పారు.

## గిరిజనుల సంక్షేమం కోసం యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

### ప్రభుత్వాన్ని కోరిన కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** నాటి దివంగత ఎన్టీఆర్ నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరకు గిరిజనుల సంక్షేమం కోసం పాటు పడింది తెలుగుదేశం పార్టీయే అని దీనిని దృష్టిలో పెట్టుకుని వారి కొరకు యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశం సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాల తర్వాత కూడా గిరిజనుల్లో వెనుకబాటు తనం చూస్తుంటే బాధ వేస్తుందన్నారు. అడవులు, పర్వతాల్లో ఉన్న గిరిజన తండాలనే కాకుండా మైదానం ప్రాంతాల్లో ఉన్న గిరిజన గ్రామాలను కూడా షెడ్యూల్ గ్రామాలుగా గుర్తిస్తే ఇటు రాష్ట్రం, అటు కేంద్ర నిధులతో ఆ కాలనీలు అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. నెల్లూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా గిరిజనుల కొరకు యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారని ఈ సవందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన కాలనీలు, లంబాడి తండాలుకు మౌలిక సదుపాయాలు కల్పించి వారిని ఆర్థికంగా ఎదగడం కోసం అనేక ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో సాంకేతికత పురోభివృద్ధిలో పయనిస్తున్న నేపథ్యంలో కూడా గిరిజనుల్లో దాదాపు 80 శాతం పైగా నిరక్షరాస్యులుగా ఉండడం బాధాకరమన్నారు. 2011 లెక్కల ప్రకారం కోవూరు నియోజకవర్గ పరిధిలో 138 గిరిజన గ్రామాలు ఉంటే అందులో 45 వేల మంది గిరిజన జనాభా ఉన్నారన్నారు. యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేసి సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో గిరిజనులకు మెరుగైన విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. గిరిజన గురుకుల పాఠశాల ఉన్నప్పటికీ ప్రత్యేక ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాల్సిన అవసరంఉందని.ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

## గ్రీవెన్స్‌డే లో అధికారులేరీ ? ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేకు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్ల అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఇందుకు ప్రధాన కారణం గ్రీవెన్స్‌డేకు అన్ని శాఖల అధికారులు హాజరైతే వచ్చిన అర్జీదారులకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంది. అయితే సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి తహసీల్దారన ఎంపీడీవో, సీడీపీవో, వ్యవసాయాధికారి, ఏపీఎం , ఇరిగేషన్ అధికారులు మాత్రం హాజరు అయ్యారు తప్ప ప్రధానమైన ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, ట్రాన్స్‌కో, పోలీసు, మండల విద్యాశాఖ అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో ఈ గ్రీవెన్స్‌డేలో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి,. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గ్రీవెన్స్‌డే అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## టిడ్కో గృహాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోండి

### కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాల మంజూరుకు అర్హులైన ప్రజలందరూ దరఖాస్తు చేసుకుని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వై.ఓ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సచివాలయాన్ని సందర్శించి అమెనిటీస్ కార్యదర్శి ద్వారా అర్హత పరిశీలించుకుని, దరఖాస్తుకు అవసరమైన పూర్తి వివరాలను పొందాలని సూచించారు. బి.పి.ఎస్ పథకాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన ప్లాన్ ను అతిక్రమించి కట్టడాలను చేపట్టవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి చేస్తామని కమిషనర్ తెలియజేశారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పట్టణ పురపాలక శాఖ మంత్రి వర్యులు పి నారాయణల ఆలోచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సరళీకృత మార్గదర్శకాలను రూపొందించి అనుమతుల మంజూరు ప్రక్రియను సులభతరం చేసిందని, భవన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్మాణాలు జరుపుకోవాలని కమిషనర్ సూచించారు.రానున్న వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, అత్యవసర పరిస్థితిలో నెల్లూరు నగరపాలక సంస్థ నుంచి యుద్ధ ప్రాతిపదికన అన్ని చర్యలు తీసుకునేందుకు సంసిద్ధంగా ఉన్నామని కమిషనర్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా అన్ని డివిజన్లలో ప్రతిరోజు క్రమం తప్పకుండా బ్లీచింగ్, స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. విభాగాల వారీగా అకౌంట్స్-2, ఇంజనీరింగ్-6, రెవెన్యూ-2, పబ్లిక్ హెల్త్-2, హౌసింగ్-20, టౌన్ ప్లానింగ్-8, హెచ్ సెక్షన్-3, ఆప్కాస్-3, మొత్తం 46 విజ్ఞప్తులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు

### తొలిరోజు రంగడి ఆలయం నుంచి 1008 మంది భక్తులతో ఊరేగింపు





**నెల్లూరు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త-విద్య :** నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసి ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం కలశ స్థాపన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో బాగంగా శ్రీ రంగనాధస్వామి ఆలయం నుండి స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వరకు 1008 మంది మహిళలు కలశాలతో గంగమ్మ, పెన్నమ్మ, నదీజలాలతో ఊరేగింపుగా బయలుదేరి శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకించడం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ కోటా గురుబ్రహ్మం కార్యనిర్వాహక అధ్యక్షులు శేగు షణ్ముఖరావు లు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా 1008 మంది మహిళా భక్తులు కలశాలతో శోభాయాత్రను అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఓం ఈ యొక్క శోభాయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ ఆ తల్లి యొక్క కృపా కటాక్షాలు మెండుగా ఉండాలని కోరుకున్నారు . అలాగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి శ్రీ కాత్యాయని అలంకారం, మూలవర్లకు పూలంగి సేవ అలంకారం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు . శ్రీ శ్రీనివాస వైష్ణవి కోలాట మండలి వారిచే కోలాటం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్ధన్‌రావు, ఉపాధ్యక్షులు వేముల ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ మునగా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనేయులు కమిటీ సభ్యులు రాజా హజరత్‌బాబు, వాయుగుండ్ల బ్రహ్మయ్య, కొల్లిపాకుల సురేష్‌బాబు, తన్నీరు కిషోర్‌కుమార్, పొడమాల రమేష్, దర్శి వెంకట జయప్రకాష్, చాటకొండ వెంకటేశ్వర్లు, పైడా కృష్ణప్రియ, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ శుక్లని కలిసిన మిడతల రమేష్



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లకు బిజెపి నేత మిడతల రమేష్ కామధేనువు ప్రతిమ నిచ్చి జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పలు విషయాలు పై చర్చించారు. అధికారులే బినామీగా జిల్లాలో పేదల గృహాలు నిర్మాణాలు చేశారని, రాష్ట్రంలో అన్ని జిల్లాలలో గృహ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవినీతి అధికారులను కాపాడడం కోసం కూటమి ప్రభుత్వ వచ్చినా ఏడాదికిపైగా నిర్మాణాలుకు అనుమతులు ఇవ్వలేదు, నిర్మాణాలు నిలిపివేశారని బేస్మెంట్ల స్టేజిలో అధిక లాభం వస్తున్నందున 15500 ఇళ్లకు బెస్మెంట్లు వేసి పనులు వదిలేశారని, 26,807 గృహాలు పూర్తయినట్లు ఫైనల్ బిల్లులు చెల్లించారు.. ఆప్షన్ త్రీ కింద గాని ఆప్షన్ వన్ కింద గాని ఫైనల్ బిల్లులు చేసిన గృహాలలో 26 వేల గృహాలు అసంపూర్ణంగానే ఉన్నాయి అన్నారు. తలుపులు కిటికీలు నీటి ట్యాంకులు బాత్రూం శానిటేషన్ కరెంటు సామాగ్రి ఇంటి లోపల పూతమని చేయకుండానే ఇల్లు పూర్తయినట్లు లబ్ధిదారులను అధికారులు మోసం చేశారని నెల్లూరు జిల్లాలో పది పర్యాయాలు విజిలెన్స్ విచారణ జరిగినప్పటికీ చర్యలు తీసుకోరు. మెటీరియల్ రికవరీ చేయరు. గృహ నిర్మాణాలు చేపట్టరని. ప్రత్యేక దృష్టి సారించి నెల్లూరు జిల్లాలో పటిష్టమైన గృహ నిర్మాణాలు జరిగేటట్టు చూడవలసిందిగా రమేష్ కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరమ్మ, పోట్లూరి శ్రీనివాసులు, సృజన, పద్మ, రఘురామయ్య, సూర్యనారాయణ, నారాయణ, ఆదినారాయణ, ముని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్మపాళెంలో 8వరాష్ట్రీయ పోషణమాసం



**జలదంకి, సెప్టంబర్22, ప్రభాతవార్త:** జలదంకి పంచాయతి పరిధిలోని కమ్మపాళెం అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ మాస కార్యక్రమం నిర్వహిం చారు. సందర్భంగా పలురకాల పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటుచేసి కార్యకర్త శాంత మహిళలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను విశదీకరి ంచారు .ముఖ్యంగా మహిళలు ఆ దిశగ అడుగులు వేయడం ద్వారా కుటుంబం మొత్తం సంతోషకరమైన జీవినం గడపవచ్చని సూసిం చారు. పిల్లలను జంక్‌ఫుడ్స్‌కు దూరంగ పెట్టడం ద్వారా ఊబకాయాన్ని నివారించవచ్చన్నారు. చక్కెర, నూనె పదార్థాల వినియోగం తగ్గించాలని పిలుపునిచ్చారు. అలాగే పిల్లల బాల్యదశ సంరక్షణ అత్యంత ముఖ్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లులతోపాటు సచివాలయ సిబ్బంది సుప్రియ, రజిత, ఆశావర్కర్ రమాదేవి, అంగన్‌వాడివర్కర్స్ పి సుగుణ, ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వవద్దు



**కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వ వద్దు అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. కావలి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియచేసి ఆర్‌డిఓ సన్నీ వంశీకృష్ణకు కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ మల్లి మాట్లాడారు. గత ప్రభుత్వం 8 వేల కోట్ల రూపాయిలతో పభుత్వ వైద్యకళాశాలలను నిర్మిస్తే నారా చంద్ర బాబు నాయుడు ప్రభుత్వం ఎకరా భూమి 1000 రూపాయిల లెక్కన లీజుకు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అన్నారు. 17 వైద్య కళాశాలల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సంబంధించి 7 వేల సీట్లు సంవత్సరానికి వస్తుంటే బడుగు వర్గాల నోరు కొట్టి కోటి రూపాయిల చొప్పున ఒక్కొక్కటి ప్రైవేటు యాజమాన్యం అమ్ముకోవడానికి ప్రయత్నించడం ప్రైవేటు వ్యక్తులకు దోపిడీకి ప్రైవేటు కళాశాలలను ఇవ్వడం దోపికీ సుగమం చేయడమే అన్నారు. వైద్య విద్య బడుగు వర్గాలకు లేకుండా చేయడమేనన్నారు. కారు చౌకగా కళాశాలలను రాజకీయ నాయకులకు అప్పగించి బడుగు విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఉద్యమంలో భాగంగా నిరసన తెలియచేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సత్యవతమ్మ, యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జరుగుమల్లి విజయరత్నం, ఎంఆర్‌పిఎస్ నాయకులు చౌటూరి లక్ష్మయ్య, జెడ్డా వాసు, ముక్కుమోహన్‌రావు, లక్ష్మి నర్సు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు దసరా సందర్భంగా సెలవులు ప్రకటించిందని తెలియజేశారు. ఈ దసరా సెలవుల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రత్యేక క్లాసుల పేరుతో పాఠశాలలను నడిపితే ఆ పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తప్పునిసరిగా కావలి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం కచ్చితంగా పాటించాలని తెలిపారు.

## నేడు ఆయుర్వేద శిబిరం



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 10వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద మరియు హోమియో వైద్య నిపుణుల బృందంచే మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని కోవూరు, చుట్టుపక్కల ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో సుమారు 10 మందికి పైగా ఆయుర్వేద హోమియో వైద్యులు పాల్గొంటారని వారి సేవలను కోవూరు ప్రజలు పొందాలని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

## రామచంద్రాపురంలో బిజెపి సేవా కార్యక్రమాలు



**బుచ్చి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని రామచంద్రాపురంలో భారత ప్రధానమోడీ 75వ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 వ తేది నుండి అక్టోబర్ 2 వ తేది గాంధీ జయంతి వరకు సేవా పక్షోత్సవాల పేరుతో సేవా కార్యక్రమం చేయమని భారతీయ జనతాపార్టీ సూచన ఇవ్వడం జరిగిందని నాయకులు తెలిపారు. బిజెపి అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ఏరియాలోని రామచంద్రపురం గ్రామ పురవీధులలో చిమ్మి, మురికి కాలువలో చెత్తను తీసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామచంద్రాపురం ఏరియాలో చెట్లు నాటడం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా బిజెపి అర్బన్ ఇన్చార్జి మారుబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈకార్యక్రమం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కాసాశ్రీనివాసులు, బిజెపి జిల్లా కార్యదర్శి అలూరు నాగవేణి , జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి మోహన్‌బాబు, అర్బన్ ప్రధాన కార్యదర్శి గోలి సురేంద్ర, సీనియర్ నాయకులు కోప్పోలు మస్తానయ్య, మాచవరం శ్రీనివాసులు, ఓబిసి మోర్చ జిల్లా కార్యదర్శి సోమలక్ష్మయ్య, అర్బన్ కార్యదర్శులు గుంజి సుధాకర్, బొందిలి శాలిని రాణి, కాసా వెంకట్ ,నాగార్జున, అర్బన్ గిరిజన మోర్చ అధ్యక్షులు ఈగ శ్రీనివాసులు, నాయకులు చేబ్రోలు మోహన్, ఎరుకల రవిచంద్ర, అమాస వాసు, పాముూరు శ్రీనివాసులు, పిల్లిమెట్ల తిరుపాలు, కత్తి రంగయ్య, క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

## మమ్మల్ని రిలీవ్ చేయండి



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** తమను పాఠశాలల నుంచి రిలీవ్ చేయాలని పలువురు ఉపాధ్యాయులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో తిక్కన ప్రాంగణంలోజరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్ హిమాన్షు శుక్లకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాము 2025 జూన్ 16వ తేదీ బదిలీ అయ్యామని పనిచేస్తున్న పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం వలన అదే పాఠశాలలో కొనసాగుతున్నామన్నారు. డిప్యూటేషన్ పై ఇదే పాఠశాలలో కొనసాగవలసి వచ్చిందన్నారు 10 సంవత్సరాలు అయిన తమను బదిలీ చేయడం లేదని తక్షణం రిలీవ్ చేసి మాకు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ని కోరారు.

## మండల సర్వసభ్య సమావేశం



**వింజమూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** వింజమూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీ ఆదివారం నిర్వహించ బడుతు ందని ఎంపీడీవో కే. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని మండల శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చిస్తారని తెలిపారు. అధ్యక్షుని అనుమతితో ఇతర అంశాలపై చర్చిం చడం జరుగుతుందని ఆయన తెలిపారు. కనుక మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## గ్రీవెన్స్ కు 6 అర్జీలు

**బిట్రగుంట సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: :** బోగోలు మండల తహసీల్దార్ కార్యాలయం లో సోమవారం జరిగిన ప్రజాపరిష్కరావేదికలో 6 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎస్. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా పరిష్కరావేదికను అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరై అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## అధిక కౌలు చెల్లించి పొగాకు పంట వేయవద్దు రైతులు నష్టపోవద్దు



**కలిగిరి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** ప్రస్తుతం పొగాకు ధరలు ఆశాజనికంగా ఉన్నాయని కౌలు రైతులు అధిక ధరలకు పొగాకు బ్యారన్లను లీజుకు తీసుకొని నష్టపోవద్దని కలిగిరి పొగాకు బోర్డు అధికారులు తెలిపారు. సోమవారం బోర్డు పరిధిలోని పొగాకు రైతులతో బోర్డు అధికారులు సమావేశమైనారు. ఈసందర్భంగా వారు మాట్లడుతూ పొగాకు పంట ధరలు ప్రస్తుతం హెచ్చుతగ్గలుగా నడుస్తున్నాయన్నారు. ధరల విషయంలో ప్రస్తుతం అంతర్జాతీయంగా మంచి వాతావరణ పరిస్తితుల కారణంగా పొగాకు పండించే బ్రెజిల్, చైనా, జిబాబ్వే మొదలగుదేశాలలో పోగాకు ఉత్పత్తి అధికంగాపండిస్తున్నారన్నారు. కనుక ఈసంవత్సరం మనదేశంలో పొగాకు ధరలు హెచ్చు తగ్గలు ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అందువలన పొగాకు పండించే రైతులు ఎవ్వరుకూడా అధిక ధరలు పెట్టి బ్యారన్లను, పొలాలను అధిక ధరలు పెట్టి కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగుచేసి నష్టపోవద్దన్నారు. రైతులు బోర్డు నిర్ణయించిన మేరకేపొగాకు సాగుచేయాలని అధిక విస్తరణలో పొగాకు సాగుచేస్తే నష్టపోవలసి వస్తుందని రైతుసోదరులు గమనించుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కలిగిరి పొగాకు బోర్డు ఎపిఎఫ్ నెం.28 వేలం నిర్వాహణాధికారి శివకుమార్, ఫీగ్రేట్, యస్. సంతోష్‌కుమార్, ఐటిసి కంపెనీ ప్రతినిది గోలి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## రైతుల కష్టాలను గుర్తించి తగిన న్యాయం చేయాలి



**కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** రైతుల కష్టాలను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని కోరుతూ అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తన గళాన్ని సోమవారం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు తల్లి నవమాసాలు మోసి జన్మనిస్తే, రైతులు ఆరుకాలం శ్రమించి పంట పండించి అన్నం అందిస్తున్నారని ఆయన వివరించారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో కురిసిన సమృద్ధి వర్షాల కారణంగా అన్ని జలాశయాలు నిండిపోయి రైతాంగం ఉత్సాహంగా పంటలు వేసిన విషయాన్ని ఎమ్మెల్యే. దగుమాటి ప్రస్తావించారు. ఖరీఫ్ సీజన్‌లో దాదాపు లక్ష 80 వేల ఎకరాల్లో పంటలు సాగు జరిగాయని తెలిపారు. గత రబీ సీజన్‌లో లక్ష క్వింటాళ్ల వరి సివిల్ సప్లైస్ శాఖ ద్వారా సిఎంఆర్ కింద ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. అయితే ఈ ఖరీఫ్‌లో పండిన ధాన్యం విషయంలో ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా రైతులు దళారులపై ఆధారపడాల్సి వచ్చిందని, ప్రతి క్వింటాకు రూ.583 నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం ఒక్కో పుట్టి ధర రూ.19,725 ఉండగా, రైతులు మార్కెట్‌లో రూ.14,000కే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వివరించారు. ఇక అకాల వర్షాల కారణంగా చాలా వరి పంటలు నేలకూలిపోవడంతో రైతులకు మరింత నష్టం వాటిల్లిందని, దళార్లు దీనిని ఆసరాగా చేసుకుని రేట్లు మరింత తగ్గిస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సివిల్ సప్లైస్ శాఖ వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం కొన్ని క్వింటాలైనా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేస్తే దళార్ల ఆధిపత్యం తగ్గి రైతులకు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. రైతాంగం పక్షాన నిలబడే ప్రభుత్వంగా తగిన చర్యలు తీసుకోవాలని, రైతులను ఆదుకునే విధంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే సభలో కోరారు.

## సిద్ధవరం సచివాలయంలో స్వస్త నారీ..స్వశక్త్ పరివార్



**సిద్దవరం(రాపూరు), సెప్టంబరు22ప్రభాతవార్త :** మండలంలోని సిద్దవరం గ్రామ సచివాలయం ప్రాంగణంలో సోమవారం స్వస్త్ నారీ..స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వేపినాపి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సూర్యధర్మేంద్ర ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఆరోగ్య పరిక్షలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్యపరిక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిపి, షుగర్ వ్యాధి పరిక్షలను ప్రత్యేకంగా నిర్వహించారు. ప్రతి మహిళ క్రమం తప్పకుండా ఆరోగ్య పరిక్షలను నిర్వహిం చుకుంటూ వారి ఆరోగ్యంపై జాగ్రత్తగా వుండాలని డాక్టర్ సూర్యధర్మేంద్ర కోరారు. ఈ వైద్యశిభిరంలో సిద్దవరం పంచాయితీ సర్పంచ్ కుంచం పెంచలయ్య, ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విజయ బాస్కర రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, కయ్యూరు మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కయ్యూరు మురళీ మోహన్ రెడ్డి, పలువురు ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, తదితరులున్నారు.

## గర్భవతులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించేలా చొరవ




**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని సచివాలయంలో సోమవారం సస్థ్ నారి ససక్త్ పరివార్ అబియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా టీబీ క్షయ ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో మహిళలకు సంబంధించి అన్ని రకాల వైద్య పరీక్షలను, స్క్రీనింగ్ టెస్టులను ఉచితంగా నిర్వహించి మందులు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో టీబీ, క్యాన్సర్, గైనకాలజీ తదితర వాటికి సంబంధించిన పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతుందని, మహిళలు ఈ మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 2వ తేది వరకు ఈ శిబిరాలు కొనసాగుతుతాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం ఆయన ఆ శిబిరంలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్స్ కూడా పరిశీలించి వారితో ప్రత్యేకంగా చర్చించారు. గర్భవతులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసిన బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, హోమియో వైద్యులు డాక్టర్ కరుణాకర్, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పద్మజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## అండర్ బ్రిడ్జి సి.సి రోడ్డు పనులను పరిశీలించిన టిడిపి నాయకులు



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద శరవేగంగా కొనసాగుతున్న సిసి రోడ్డు, బాక్స్ కల్వర్ట్, బ్యూటిఫికేషన్ పనులను టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. సి.సి. రోడ్డు పనులు పూర్తయి, బాక్స్ కల్వర్ట్ మరియు బ్యూటిఫికేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే నాణ్యతా ప్రమాణాలతో సిసి రోడ్డు ప్రజల వినియోగానికి అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈ పనులపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండాల మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు, మదన్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు కాకు మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు పొదలకూరు గ్రామదేవత పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవం



**పొదలకూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** పొదలకూరు గ్రామ దేవత, శక్తి స్వరూపిణి అయిన శ్రీ పోలేరమ్మ దేవస్థానం 13వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం నిర్మాణదాత ఊకోటి లక్ష్మి నారాయణ తెలిపారు. ఉదయం నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం వివిధ రకాల అభిషేకాలు, పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

## మహిళలకు ఆరోగ్యంపై అవగాహన అవసరం



**ఆత్మకూరు, సెప్టెంబరు22, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారిణి షేక్ అస్మ ఆధ్వంర్యంలో సోమవారం స్వస్థ్ నారి-స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు వార్డు కౌన్సిలర్ రమాదేవి, టౌన్ మహిళా విభాగ అధ్యక్షురాలు పులిమి శైలజారెడ్డి, యునాని డాక్టర్ అబ్దుల్ రజాక్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సునీలత లు హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ అస్మ మాట్లాడుతూ ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశం కుటుంబంలోని మహిళ అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉంటే ఆకుటుంబం ఆరోగ్యం, విద్య తదితర విషయాల్లో ముందుంటుందన్నారు. ఈ విషయాలపై గర్భవతులకు, బాలింతలకు మహిళలకు అవగాహన కల్పించి తమ కుటుంబాలు అన్ని అంశాల్లో ముందుండాలన్నారు. అదేవిధంగా గర్భవతులు సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రతినెలా పరిక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీతను అధిగమించాలన్నారు. దానికి సంబంధించిన ఐరన్ మాత్రలు, ఆకుకూరలు, పాలు, గుడ్డు తీసుకోవాలన్నారు. ప్రతి నెల 9వ తేదీ పిఎంఎస్‌ఎంఎస్‌ప్రోగ్రాంకి వెళ్ళి డాక్టర్‌చేత పరిక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలన్నారు. బిడ్డ పెరుగుదలకు బిడ్డ ఆరోగ్యంగా ఉండేదానికఇ పౌష్టికాహారం కావాలన్నారు. బాలింతలకు కూడా పిల్లలకు నాణ్యమైన పాలు తీసుకోవాలన్నారు. అలాగే షుగర్, బిపి ఉన్నవారికి పరిక్షలు నిర్వహించి మాత్రలు సరఫరా చేశారు. ముఖ్యంగా మహిళలకు గర్భాశయ క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్ , నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ చేసి వారికి వాటి గురించి అవగాహన కల్పించారు. వృద్ధులకు పరిక్షలు నర్విహించి మాత్రలు సరఫరా చేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, హెల్త్ సూపర్‌వైజర్‌లు ఎస్.సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ యు.పార్వతి, ఎఎన్‌ఎంలు, యుపిహెచ్‌సి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

## బోల్తా పడిన లారీ.. స్వల్ప గాయాలతో బయటపడ్డ డ్రైవర్, క్లీనర్



**వింజమూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** వింజమూరు పాతూరు చెరువు కట్టపై సోమవారం సిమెంటు లోడుతో వస్తున్న లారీ ట్రావెల్ బస్‌కు సైడ్ ఇస్తూ చెరువులో బోల్తా పడడంతో డ్రైవర్ క్లీనర్ స్వల్ప గాయాలతో భయటపడిన సంఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఏఎస్పై జయరాజ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి జరిగిన సంఘటన గురించి పరిశీలించారు. సిమెంట్ లోడ్‌తో వస్తూ చెరువు కట్ట సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వడానికి మార్జిన్ లోకి రాగానే పూర్తిగా దిగబడిపోవడంతో లారీ అదుపు తప్పి చెరువులో పడిపోయింది. దీంతో డ్రైవర్ క్లీనర్ చాకచక్యంగా తప్పించుకొని స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైవే రోడ్డు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ మార్జిన్‌ను గ్రావెల్ తోలి వదిలేయడంతో వర్షం పడిన కారణంగా ఆ గ్రావెల్ దిగబడిపోవడంతో లారీ బోల్తా పడినట్లు తెలుసుకున్నారు. రహదారి మార్జిన్ సరిగా లేనప్పుడు రోడ్డు నిర్మాణం జరుగుతున్నట్లుగా సూచికలు ఏర్పాటు చేయాలని అలాంటివి జరగలేదని అందుచేతనే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఇప్పటికైనా రోడ్ల నిర్మాణదారులు ఇలాంటి ద్రపేశాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

## పంచాయితీని పరిశుభ్రంగా వుంచేందుకు ప్రజలు సహకరించాలి

## ..ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేసిన సర్పంచ్ చెన్ను సంపూర్ణమ్మ



**సంక్రాంతిపల్లి(రాపూరు), సెప్టంబరు22ప్రభాతవార్త :** పంచాయితీని పరిశుభ్రంగా వుంచేందుకు ప్రజలు సహకరించాలని రాపూరు మండలం, సంక్రాంతిపల్లి గ్రామ సర్పంచ్ చెన్ను సంపూర్ణమ్మ కోరారు. సోమవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా పంచాయి తీలోని ప్రజలకు రాష్ట ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సూచనలతో చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్ల మీద పోయకుండా చెత్త బుట్టలలో వేసి పంచా యితీ వాహనం వచ్చినప్పుడు చెత్తను అందులో వేయాలన్నారు. దీని వల్ల పంచాయితీ శుభ్రంగా వుంటుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు సోసైటీ మాజీ ఛైర్మన్ చెన్ను బాస్కర రెడ్డి, పంచాయితీ కార్య దర్శి అట్ల కవిత తదితరులున్నారు.

## ప్రమాదాలకు నిలయంగా మారిన జిల్లాలోని జాతీయ రహదారులు



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** జిల్లాలోని జాతీయ రహదారులు నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన జిల్లా రహదారుల భద్రతా మండలి నామమాత్రంగా మిగిలిపోయిందన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా వాటిని నివారించాల్సిన ఈ రహదారి భద్రతా మండలి చోద్యం చూస్తుందన్నారు. జిల్లాలో 90 శాతం ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్నా ఆ శాఖ అధికారుల్లో కనీస స్పందన లేదన్నారు. మూడు క్యాలెండర్ సంవత్సరాల్లో ముగ్గురు కంటే ఎక్కువగా ఒకే ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో మరణించినట్లయితే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి ఆ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే జాతీయ రహదారి అధికారులు నేటికీ అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వారి నిర్లక్ష్యం కారణంగానే అనేకమంది విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు జిల్లా స్థాయిలో కలెక్టర్ కన్వీనర్‌గా ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులతో జిల్లా రహదారి భద్రతా మండలి ఉందన్నారు. ఈ భద్రతా మండలి ఎప్పటికప్పుడు సమావేశమై రోడ్డు ప్రమాదాలపై చర్చించి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఈ కార్యాచరణ కేవలం మాటలకే పరిమితమవుతుందన్నారు. జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ , ఎస్పీ అధికారులు జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించి రహదారి భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రోడునడ ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నగదు రహిత ఉచిత చికిత్సపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం

– జిల్లా యస్‌పి అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుండి వచ్చిన బాధితుల నుండి 122 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండ రాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని, వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుచ్చికి చెందిన మహిళను అదే ప్రాంతానికి చెందిన కాలేషా అనే వ్యక్తి సన్నిహితంగా ఉంటూ తన యొక్క వ్యక్తిగత ఫోటోలు వీడియోలు తీసుకొని తను చెప్పినట్టు వినాలి బెదిరిస్తూ, తన బంధువులకు స్నేహితులకు అబద్ధపు ప్రచారం చేస్తూ, తన వ్యక్తిగత ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా ఉదయగిరికి చెందిన మహిళను వింజమూరుకు చెందిన హరేంద్ర అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. వెంకటాచలంకి చెందిన వృద్ధుడు, తను జీవనోపాధి కోసం కూడబెట్టుకున్న 3 లక్షలు నగదును, వాషింగ్ మిషన్‌ను తన పెద్ద కుమార్తె ప్రమీల ఆమె భర్త తీసుకెళ్లినట్లు, వృద్ధాప్య పింఛన్ కూడా తీసుకుంటున్నారని, తనకు పూట గడవడం కూడా కష్టంగా ఉందని, తన జీవనోపాధిని చూసుకోకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. వెంకటాచలం పరిధికి చెందిన మహిళకు, వెంకటాచలం మండలంలో తనకు హక్కుగా కలిగిన స్థలాన్ని నెల్లూరుకు చెందిన పుల్లారెడ్డి అనే వ్యక్తి దురుద్దేశంతో ఆక్రమించుకొని దున్నేశాడని అడిగితే బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా యస్.పి. హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ డిఎస్పి గట్టమనేని శ్రీనివాసరావు, కావలి డిఎస్పి శ్రీధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఉమెన్ పిఎస్ సిఐ సుబ్బారావు, ఎస్‌బి–2 సిఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొలాలకు పోవుటకు,కర్మకృతులు చేయుటకు దారి లేకుండా అడ్డగిస్తున్నారు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** కలువాయ మండలంలోని వెంకటరెడ్డి పల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు పెన్నా నది వెంబడి ఉన్న పొలాలకు పోవుటకు, కర్మ కృత్తులు చేయుటకు దారి లేకుండా అదే గ్రామానికి చెందిన శెట్టిపల్లి సురేష్ అనే వ్యక్తి జేసిబి సహాయంతో భారీ గుంత తవ్వాడని, నేషనల్ హైవే ఏర్పడడంతో కొత్త బ్రిడ్జి కట్టిన నేపథ్యంలో హైవే బ్రిడ్జి ఇరువైపులా తమ పొలాలు ట్రాక్టర్ వెళ్లడానికి కూడా వీలు లేకుండా, మనిషి చనిపోతే కర్మ కృతులు చేసుకునే విధంగా దారి లేకుండా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వెంకటరెడ్డి పల్లి చెందిన గ్రామస్తులు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అర్జీ సమర్పించారు. ఈ విషయంపై వెంటనే చర్యలు చేపట్టాలని కలువాయి ఇంచార్జి తాసిల్దార్ వెంకటేశ్వర్లుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతులకు గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన తెలిపారు.

## వదల బొమ్మాలి నిన్ను వదల

– ప్రజల ప్రాణాలతో చెలగాటం – పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



**కొడవలూరు,సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** మండల కేంద్రం హరిజనవాడ కాలనీలో విద్యుత్ ట్రాన్స్ఫారం, రోడ్డు ఇరువైపుల ఉన్న తీగలు ప్రమాదకరంగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే అకాల వర్షాలు ముమ్మరం అవుతున్నాయి విద్యుత్ సమస్య ఏ సమయంలో ఎలా మారి ఏమి జరుగుతుందో ప్రాణాలకు గుప్పెట్లో పెట్టుకొని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫారంకు పిచ్చి మొక్కలు అల్లుకుపోయి దర్శనమిస్తున్నాయి. నిత్యం హరిజనవాడ రోడ్డు వైపు పాడి పశువులు, గొర్రెలు వెళుతుంటాయి ఈ ట్రాన్స్ఫారంకు అల్లుకుపోయిన పిచ్చి మొక్కలను పాడిపశువులు ఆశించి మేత కొరకు వెళ్లాలంటే అంతే సంగతులు ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి డ్రై క్యాంపులో ట్రాన్స్ఫారంకు అల్లుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓటర్ల జాబితాను వెంటనే సిద్ధం చేయాలి




**కొడవలూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** మండల తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు ఎన్నికల ఓటర్ల జాబితా విషయంపై సోమవారం తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2002 నుండి నేటి వరకు ఉన్న రెండు ఓటర్ లిస్టులను పరిశీలన చేసి వాటిలో ఉన్న పేర్లను గుర్తించి చిన్న జాబితాలు వేగవంతంగా తయారు చేసి అందజేయాలన్నారు. అదేవిధంగా వీఆర్వోలు జాగ్రత్తగా ఓటర్ లిస్టును వాటిలో ఉన్న పేర్లను పరిశీలన చేసి జాబితాలు ఈనెల 25వ తేదీ లోపల పూర్తి చేసి జిల్లా అధికారులకు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సారంగపాణి, ఆర్ ఐ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే కి మండల అధికారులు డుమ్మా




**కొడవలూరు సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా వేదిక పరిష్కార కార్యక్రమానికి ప్రతి సోమవారం ప్రజలు సమస్యలు తెలుపుటకు సంబంధిత కార్యాలయం వద్దకు చేరుకుంటారు. సమస్యల తెలుసుకొని పరిష్కరించాలని రాష్ట్ర పరిపాలకులు చెప్పిన విషయం తెలిసిందే అయితే కొడవలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక పరిష్కార కార్యక్రమాన్ని కి సూపరింటెంట్ మినహాయించి మిగిలిన అధికారులు డుమ్మా కొట్టారు. నూతన జెసి వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టిన వెంటనే బాధ్యతగా వీడియో కాన్ఫరెన్స్ లో ఉన్నారు. మరి మండలంలో పనిచేస్తున్న అధికారులు అజెండా నియమాలను తుంగతుక్కి చలమనవుతున్నారు. స్థానిక ఎంపీడీవో ఒంగోలులో ట్రైనింగ్ లో ఉన్నారు. ఆయన బాధ్యతలను కింద స్థాయి అధికారులకు అప్పగించడం, వారు కూడా అందుబాటులో లేకపోవడం సమస్యలపై ప్రజలు కార్యాలయం వద్దకు చేరుకుంటే ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక వెనుతిరిగారు.

## వీడియో కాన్ఫరెన్స్ లో జేసి వెంకటేశ్వర్లు



**విడవలూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే సందర్భంగా నెల్లూరు నూతన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు వీడియో కాన్ఫరెన్స్ లో పలు సమస్యలను క్రింద స్థాయి అధికారులకు తెలియజేస్తూ తెలుసుకున్నారు. విడవలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జెసి వీడియో కాన్ఫరెన్స్ను వీక్షిస్తూ పలు అంశాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో చలమచర్ల వెంకట రమణమ్మ,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, హౌసింగ్ డి ఈ, ఎం ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నాగవరపమ్మ ఉత్సవాలు ప్రారంభం



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న గ్రామదేవత శ్రీ నాగవరపమ్మ దేవస్థానంలో సోమవారం అమ్మవారి ఉత్సవాల సందర్భంగా కలశస్థాపన కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొత్తం 10 రోజులపాటు అమ్మవారికి వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రసాద్, మల్లికార్జున రెడ్డి, భక్తులు ఉన్నారు.

## వీవీపాలెం ఎంపీడీవోగా శంకరరావు



**వలేటివారిపాలెం, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** వలేటివారిపాలెం మండలానికి రెగ్యులర్ ఎంపీడీవోను నియమించారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలంలో ఏవోగా పనిచేస్తున్న వై.శంకరరావు పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం ఆయన స్దానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో నరేంద్రదేవ్ నుంచి బాద్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండలపరిషత్ ఏవో నరేంద్రదేవ్ ఇన్‌చార్జ్‌గా ఎంపీడీవోగా వ్యవహరించిన విషయం పాఠకులుకు విదితమే.

## డిసిపల్లిలో పొగాకు రైతుల సమావేశం



**మర్రిపాడు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** డిసిపల్లి పొగాకు వేలం కేంద్ర పరిధిలోని రైతులకు సోమవారం 2025–26 పంట కాలానికి సంబంధించి పొగాకు పంట నియంత్రణ–ఆవశ్యకతపై పొగాకు రైతులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పొగాకుబోర్డు ఆక్షన్ సూపరింటెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ 2025–26 పంటకాలానికి పొగాకు బోర్డు ఒక బ్యారన్‌కు 2.90 హెక్టార్లు (7.25ఎకరాలు) మరియు 3665కిలోలు పండించడానికి అనుమతించడమైందని , ప్రతి రైతు పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితిలోనే పొగాకు సాగుచేయాలని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పొగాకు ధరలు బాగా ఉండడంతో పొగాకు పంట అనుమతి ఇచ్చిన దానికన్నా చాలా ఎక్కువగా పండిస్తున్నారని , అలాగే ఖర్చులు కూడా పెంచుకన్నారని, ఎక్కువ పొగాకు వేయడం వలన సకాలంలో ఆకు రేల్చక పోవడం వలన ఎక్కువ నాణ్యమైన పొగాకు పండించలేకపోయారని, కావున పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పొగాకు సాగుచేసి మంచి నాణ్యమైన పొగాకును పండించాలని అప్పుడే రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. ఎక్కువ పొగాకు పండించడం వలన డిమాండ్ తగ్గి సరైన ధర రాకపోవచ్చని బ్యారన్, పొలాలను ఎక్కువ ధరలకు కౌలుకు తీసుకొనకుండా అన్ని ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. పొగాకు నారును వాణిజ్య సరళిలో పండించుకునే రైతులు తప్పకుండా పొగాకు బోర్డు అనుమతి తీసుకోవాలని , బ్యారన్ లైసెన్సు ఉన్నవారు మాత్రమే నారు అమ్మాలన్నారు. ఈకార్యక్రమంలో ఐటిసి మేనేజర్ విజయ్, జిపిఐ మేనేజర్ హుమయూన్ , పొగాకుబోర్డు ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్ జగన్నాథన్, రైతులు పాల్గొన్నారు.

## వైసిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నేడే

**ఆత్మకూరు,సెప్టెంబరు22,ప్రభాతవార్త :** వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆత్మకూరులోని శ్రీధర్‌గార్డెన్స్ లో ఈకార్యక్రమం జరుగుతుందని మేకపాటి కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు, నెల్లూరుపార్లమెంట్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటరీ పరిశీలకులు వెంకట్‌రఎడ్డి, జిల్లాపరిషత్ చైర్మెన్ ఆనం అరుణమ్మ, జిల్లాపరిషత్ మాజీ చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. కావున ఆత్మకూరు నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల కన్వీనర్లు, మండల కమిటీ సభ్యులు, సడ్పీటిసి సభ్యులు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వైస్‌చైర్మెన్‌లు, వార్డుసభ్యులు, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు, సోషల్‌మీడియా సభ్యులు హాజరు కావాలని వారు కోరారు.

## మళ్లీ వెంకటేశ్వర్లును ఢీకొట్టిన వాహనం ఆర్టీసీ బస్సు

## ఎస్సై జంపని కుమార్



**దగదర్తి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన ఉప్పలపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మళ్లీ వెంకటేశ్వర్లు ఢీకొట్టిన వాహనం ఆర్టీసీ బస్సుగా నిర్ధారణ అయింది. ఎస్సై జంపని కుమార్ జరిగిన 24 గంటల లోపే ఆయన ఆలోచనలతో చేధించి పోస్టుమార్టంలో బలమైన వాహనం అని చెప్పడంతో ఆ టైంలో వచ్చే వాహనాల గురించి ఆలోచించి గ్రామంలో ఉన్న సీసీ పుటేజ్ ఆధారంగా ఆర్టీసీ బస్సుగా నిర్ధారణ చేసి కేసుని చేధించారు. వెంకటేశ్వర్లు బంధువులు ఉలవపాడు గ్రామ ప్రజలు ఎస్సై జంపని కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సై జంపని కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఉంటే గ్రామానికి ఉండేలా చూసుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. అంతే కాకుండా దగదర్తి మండలానికి ఎస్సై జంపని కుమార్ రాక ముందు పేకాటలు గాని, కోడి పందాలు విచ్చల విడిగా జరిగేవి. దాని వల్ల ఎన్ని కుటుంబాలు వీధిన పడి ఉంటాయో ఆయన వచ్చిన తర్వాత మండలంలో ఆయన కోడి పందాలు, పేకాటలపై చేసిన దాడుల వల్ల ఎక్కడ కోడి పందాలు, పేకాటాలు జరుపుకోవాలని భయపడుతున్నారు. ఎక్కడ ఏమి జరగటం లేదని దగదర్తి మండలంలోని ప్రజలు జంపని కుమార్ సార్ మీరు గ్రేట్ సార్ అని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై జంపని కుమార్ ఇంకా కొన్నాళ్లు దగదర్తి మండలంలోనే ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆక్వా రైతులు అక్టోబర్ 15 లోపల తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

– ఎఫ్‌డీఓ సురేష్ బాబు విజ్ఞప్తి




**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి సూచన మేరకు కమీషనర్ ఆఫ్ ఫిషరీస్, నెల్లూరు జాయింట్ డైరక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఆదేశాల మేరకు ఇందుకూరుపేట మండలంలో కుడితిపాలెంలో గల సాగు చేస్తున్న ఆక్వా రైతులు అక్టోబర్ 15 లోపల తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఫ్‌డీఓ సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. సమీప సచివాలయాల ద్వారా సంబంధిత అప్లికేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే రైతాంగానికి తమ శాఖ ద్వారా అందాల్సిన సబ్సిడీ రాయితీలు రావన్నారు. ఈ విషయాన్ని ఆక్వా రైతులు అర్థం చేసుకొని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని మత్స్యశాఖ ద్వారా సబ్సిడీలు రాయితీలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుడితిపాలెం సర్పంచ్ నాయుడు సురేష్, మెట్ట వెంకట రమణారెడ్డి, మత్స్యశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 112 కాల్ ద్వారా ఒకవ్యక్తి ప్రాణాలు కాపాడిన కోవూరు పోలీసులు



**కోవూరు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** నెల్లూరు బి.వి నగర్ లో కారు స్వరూప అనే మహిళ తన తమ్ముడు కందల వంశీ తండ్రి శ్రీనివాసులు(26) వేగూరు గ్రామం, కోవూరు మండలం అనునతను మానసిక స్థితి సరిగా లేక తను చనిపోతున్నానని, అమ్మ,నాన్న లను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఫోన్ చేయడంతో ఈ విషయాన్ని 112 కు తెలియజేశార వెంటనే స్పందించిన కోవూరు ది। వి.సుధాకర రెడ్డి గారు కందల వంశీ ఫోన్ లొకేషన్ కు ట్రాక్ చేసి, వంశీ రామన్నపాలెం రైల్వే ట్రాక్ వద్ద ఉన్నట్లు గుర్తించి తన సిబ్బందిని సదరు లొకేషన్ కు పంపించి కందల వంశీని కాపాడి, అతని అక్క స్వరూపాకు అప్పగించారు.

## రామాయణం సుందర కావ్యం





**ఇనమడుగు (కోవూరు,) సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** వాల్మీకి మహర్షిచే సంస్కృతంలో రచించబడిన రామాయణం అద్భుతమైన కావ్యమని శ్రీ సత్యానంద ఆశ్రమ పండితులు అవధాని కోట రాజశేఖర్ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న సత్యానంద ఆశ్రమంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భగవాన్ సత్యానంద మహర్షుల వారి 29వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని సోమవారం అవధాని కోట రాజశేఖర్ ఆధ్వర్యంలో శ్రీమత్‌నారాయణ ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ సపందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి మాట్లాడుతూ రామాయణ కావ్యాన్ని ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పితృవాక్యపరిపాలన, ఏకపత్ని వ్రతం వంటి ఉన్నత ఆశయాలకు రామాయణం సుందరకావ్యం అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో విద్వాన్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, శ్రీ రామతీర్థ స్వామి, శ్రీ పురుషోత్తమ తీర్థస్వామి, కార్యదర్శి నాగేశ్వరరావులు పలు విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### దావా సమను

అండర్ ఆర్డర్లు 5 రూల్ 1& 5 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 476/2023

మోలా కొండారెడ్డి .....వాది
వర్సెస్
షేక్.బాబు .....ప్రతివాది
టు
ప్రతివాది: షేక్.బాబు తండ్రి మస్తాన్
సాకిన్: తిమ్మారెడ్డిపల్లి గ్రామం, వరికుంటపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

పై నెంబరున వాది దావా సైకముకోరి మీపైన దావా దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలు ఉన్నచో తేది: 10-10-2025 ది పగలు 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారాగాని పైకోర్టు వారి ఎదుట హాజరై తెల్పుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడునని తెలుసుకొనేది.

(By Order of the Court)
వాయిదా తేది: 10-10-2025

కనిగిరి
తేది: 18-09-2025

అబ్దుల్ గఫార్ షేక్.,
వాది తరపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్

### దావా సమను

అండర్ ఆర్డర్లు 5 రూల్ 1& 5 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 477/2023

మోలా కొండారెడ్డి .....వాది
వర్సెస్
షేక్.బాబు .....ప్రతివాది
టు
ప్రతివాది: షేక్.బాబు తండ్రి మస్తాన్
సాకిన్: తిమ్మారెడ్డిపల్లి గ్రామం, వరికుంటపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

పై నెంబరున వాది దావా సైకముకోరి మీపైన దావా దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలు ఉన్నచో తేది: 26-09-2025 ది పగలు 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారాగాని పైకోర్టు వారి ఎదుట హాజరై తెల్పుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడునని తెలుసుకొనేది.

(By Order of the Court)
వాయిదా తేది: 26-09-2025

కనిగిరి
తేది: 18-09-2025

అబ్దుల్ గఫార్ షేక్.,
వాది తరపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్

### ప్రకటన

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వింజమూరుకు చెందిన కొర్రపాటి కాజాభి భర్త పీరుసాహెబ్ ఉన్నది. దీనిని కొర్రపాటి కాజమ్మ పుట్టిన తేది. 24.06.1970గా నమోదు కాబడినదని తెలియజేయడమైనది.

## చెక్క బండ్లు మంజూరు చేయండి



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** ఐటీడీఏ తరఫున చెత్త తోలుకొనే ఎస్టీలకు తోపుడు బండ్లు అందించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్ హిమాన్షు శుక్లకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సరుకులు వేరుకునే మాకు చెత్త బండ్ల రిక్షాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఐటిడిఏ తరఫున ఈ రిక్షాలు మంజూరు చేస్తే తమకు ఎంతో హాయిగా ఉంటుందని అందువలన తోపుడుబండ్లను రిక్షాలను తమకు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎం. రంగయ్య సిహెచ్ ఉష, సతీష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభాతవార్తకు స్పందన



**కొడవలూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న గ్రామ సచివాలయంలో ఇటీవల మండల అధికారుల పేర్లను బోర్డులపై మార్చకపోవడంపై "జర బోర్డు మార్చండి సార్"కథనాన్ని (ప్రభాతవార్త) ప్రచురించడంతో పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించి బోర్లపై పేర్లను తొలగించి ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల విస్తరణ అధికారిని ఎస్ మహేశ్వరి పేరును కనబడచడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభాతవార్తను అభినందించారు.

## రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం


## మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**వెంకటాచలం,సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారే వ్యవస్థ దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందని రైతులకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. వెంకటాచలం మండలంలోని తాటిపర్తి పాలెం గ్రామంలో రైతులు ధాన్యాన్ని సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు రైతుల పరిస్థితి కూటమి ప్రభుత్వంలో దయనీయంగా తయారైంది. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం క్యూలో రోజుల తరబడి నిలబడి అవస్థలు పడుతున్నారు.రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందక, రైతులు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో నేను వ్యవసాయ శాఖ మంత్రిగా రైతులు పండించిన ప్రతి పంటకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి రైతులు నష్టపోకుండా చూశాం. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో, దళారులు రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు దళారుల వద్ద నష్టపోయే పరిస్థితి ఏర్పడేది కాదు. చంద్రబాబు పాదం మోపితే రైతులకు అరిష్టం ఎప్పుడు నష్టమే తాము పండించిన పంట, కోతల సమయంలో వర్షాల కారణంగా రేటు పడిపోవడంతో రైతులపై భారం పడుతుంది.50 శాతం కంటే అదనంగా యూరియా వ్యవసాయ శాఖ మంత్రి ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాల్సిన అవసరం ఏముంది రైతులు 270/రూపాయలు ఉన్న యూరియా బస్తాను,600 నుండి 700 రూపాయలు పెట్టి బ్లాక్ మార్కెట్లో కొంటున్నారు. కూటమినేతలు 250 కోట్ల రూపాయలు దండుకోవడానికి బ్లాక్ మార్కెట్ ద్వారా రైతులను దోచుకుంటున్నారు. రైతులు నష్టానికి అమ్ముకున్న తర్వాత చంద్రబాబు ధాన్యాన్ని కొంటామని ప్రకటన చేస్తాడేమో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు ఎకరానికి 25వేల రూపాయలు నుండి 30 వేల రూపాయలు నష్టపోతున్నారు.సోమిరెడ్డి తన స్వార్ధ ప్రయోజనాల కోసం ఆరాటపడుతున్నాడు. జగన్మోహన్ రెడ్డి గారు ప్రభుత్వం ఏర్పడితేనే రైతులు సంతోషంగా ఉంటారు. రైతులందరూ అన్ని విధాలా ఆదుకున్న జగన్మోహన్ రెడ్డి పాలన కోసం ఎదురుచూస్తున్నారు. రైతంగ సమస్యలను తీర్చడానికి ప్రతిపక్ష నాయకులుగా జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా అండగా నిలిచి, పోరాటం చేస్తుందని తెలియజేస్తున్నాం.ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు మండల వెంకట శేషయ్య,మండల వైసీపీ కన్వీనర్ మోమన్ నాయుడు,ఉప ఎంపిపి కనుపూరు కోదండ రామిరెడ్డి,ఈదగాలి ఎంపిటిసి సభ్యులు భీమారెడ్డి రఘునందన్ రెడ్డి,దేగ శ్రీనివాసులు,గుమ్మ మోహన్,కిష్టయ్యా,దశయ్యా మండలంలోని వైసీపీ నాయకులు,కార్యర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి సహకారం

## మరువలేనిది ఎంఈఓ శివకుమార్



**లింగసముద్రం సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** పాఠశాల అభివృద్ధికి దాతలు పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అవసరమని మండల విద్యాశాఖ అధికారి 2 శివ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వెంగళాపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.పూర్వ విద్యార్థి, గ్రామానికి చెందిన నారిబోయిన ముసలయ్య పాఠశాల విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందించారు. సందర్భంగా పాఠశాల అభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు ఐడెంటిఫికేషన్ కార్డులను అందించిన నారిబోయిన ముసలయ్యని ఎంఈఓ2 శివ కుమార్, లింగసముద్రం కాంప్లెక్స్ చైర్మన్ మాధవరావు,మొగిలిచర్ల ,చినలాటరిపి ప్రధానోపాధ్యాయులు కే సూర్య ప్రకాశరావు, పూరిమిట్ల దామోదర్,గ్రామ పెద్దలు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు సూచనలు చేయడం జరిగింది. అదేవిధంగా వెంగళాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఎస్తేర్ రాణి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనందున ఆమెను కూడా పాఠశాల సిబ్బంది పాఠశాలలోనే శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదాతలను ఆదుకోండి



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** గత రబీ సీజన్‌లో ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే హమాలీ కూలీతో సహా చెల్లించి అన్నదాతను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూడా వరి రైతులను ఆదుకునేలా ఆదేశించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యానికి గిట్టుబాటు దక్కక నష్టపోతున్న కోవూరు నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ఆమె శాసనసభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి ముందు చూపు కారణంగా రాష్ట్రంలోని జలాశయాలు కళకళలాడుతున్నాయన్నారు. కోవూరు రైతాంగానికి వరి పంటే ఆధారమన్నారు. పుష్కలంగా నీటి వసతి ఉన్న కారణంగా రైతులు వరి పంట వేశారని, దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్లు చొరవ తీసుకుని వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం ఆదేశించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## వైభవంగా కలశ ఊరేగింపు

























**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థా నంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భం గా సోమవారం 108 కలశాలతో మహిళలు కలశ స్థాపన ఊరేగింపు సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి ఈ కలశ ఊరేగింపు కోవూరు పురవీధుల్లో అత్యంత వైభవంగా ఆలయ ప్రాంగణం వంకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్. రమేష్‌బాబు, కోశాధికారి ఎం. రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు సీహెచ్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు అవధానం నంద కిషోర్ స్వామి, భక్తులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మేళతాళాలు, మంగళ వాయిద్యాలు డప్పులు, విచిత్ర వేషధారణలు, నృత్యం కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి.

## వైభవంగా కలశ స్థాపన



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని పాటూరు రోడ్డులో వెలసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 26వ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రాత:కాలమునే కలశ స్థాపన, గణపతి హోమం, అభిషేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గూడలి మనోహర్ శర్మ ఆధ్వర్యంలో సాంప్రదా య బద్దంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఇసనాక శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు. గణపతి హోమం కార్యక్రమానికి ఉభయకర్తలుగా బెంగుళూరుకు చెందిన సుహాసిని, సుధాకర్‌రెడ్డిలు వ్యవహరించారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి సాంప్రదాయబద్దంగా కలశ ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు ఆలూరు శ్రీనివాసులురెడ్డి, ఆలూరు అనిల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

## సాంప్రదాయబద్ధంగా కలశ స్థాపన




**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని బుద్ధివారి వీధిలో వెలసి ఉన్న శ్రీ రామ లింగ చామేండేశ్వరి మహాదేవి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు పట్టిపల్లి రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. కలశస్థాపన కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పిచ్చిక మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, పెద్ద ఎత్తున దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సావిత్రిదేవిగా కన్యకాపరమేశ్వరి



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో వెల సి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో శరన్నవరాత్రి మహోత్సవాలు అం గరంగవైభవంగా ప్రారంభమయ్యా యి. సోమవారం ఈ ఉత్స వాలను పురస్క రించుకుని ఆలయాన్ని విద్యుద్దీ పాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ప్రాత:కాలమునే అమ్మవారికి మహా న్యాస పూర్వక రుద్రా భిషేకం, సప్తపది పారాయణం కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు అవధానం నందకిషోర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనం తరం మహిళా మణులచే లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం అమ్మవారు సావిత్రిదేవి అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వై. వెంకట సుబ్రహ్మణ్యం, వెంకట సురేష్, కుటుంబ సభ్యులు వ్యవ హరిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్. రమేష్‌బాబు, కోశాధికారి ఎం. రమేష్‌బాబు, భక్తులు ఉన్నారు.

## త్రిపురసుందరీ దేవి అలంకారంలో రాజరాజేశ్వరి



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని పాటూ రు రోడ్డులో వెలసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి మం దిరంలో 26వనవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సంద ర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. గురు వారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకా రం లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా పూసపాటి శ్రీని వాసులురెడ్డి-త్రివేణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ కార్యని ర్వాహకులు ఆలూరు శ్రీనివా సులురెడ్డి, ఆలూరు అనిల్‌కు మార్‌రెడ్డి, డాక్టర్ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

## జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి సన్నిధిలో అత్యంత భక్తి శ్రద్దల నడుమ కలశస్థాపన





**బుచ్చి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అత్యంత వేడుకగా కలశస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్నానది నుండి బిందె తీర్ధ తీసుకొని వచ్చారు. అర్చకులు అత్యంత భక్తి శ్రద్దలతో కలశస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా చింతం సుందరమారెడ్డి వ్యవహారించారు.

## తిక్కన ప్రాంగాణని పరిశీలించిన కలెక్టర్ శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టంబర్ 22, ప్రభాతవార్త** జిల్లాలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కారా వేదికలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తరవాత మొదటి పీజీఆర్ఎస్ కావడంతో తిక్కన ప్రాంగాణం జిల్లా కలెక్టర్ శుక్ల ఆవరణ మొత్తం పరిశీలించారు. పిజిఆర్ఎస్ అర్జీలు రాసే ప్రదేశం ఆన్లైన్ ప్రక్రియ జరిగే ఆవరణం, ప్రజలు ఎండ తీవ్రతలకు ఇబ్బంది పడకుండా, తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ విజయ్ కు మార్‌కు సూచించారు. జిల్లా నలుమూలన నుండి వచ్చే అర్జీదారులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది కలగ కుండా మంచినీరు భోజన వసతి సకాలంలో అందించే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు.

## దేవి శరన్నవరాత్రులు ప్రారంభం





**వింజమూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుండి ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహించబ డతా యని దేవస్థాన ఆలయ కమిటీ చైర్మన్ కరకరల మాల కొండారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం గణపతి పూజ కలశస్థాపన మొదలగు పూజా కార్యక్రమాలను జరిపించారు. సోమవారం అమ్మవారి పూజా కార్యక్రమాల్లో భాగంగా కరకల మాలకొండారెడ్డి దంపతులు చేబ్రోలు వసంతరావు దంపతులు ఇతర భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. 23వ తేదీన అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దేవత మధుసూదన్‌రావు, సుగుణ దంపతులు కుమారుడు మణిచంద్ర వ్యవహారిస్తున్నారు. 24వ తేదీన గాయత్రీ దేవిగా ఉభయకర్తలు పైడాల కృష్ణారెడ్డి లతా దంపతులు కుమార్తె మనీషారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి దంపతులు వ్యవహారిస్తున్నారు. 25వ తేదీన అన్నపూర్ణాదేవిగా ఉభయకర్తలుగా కొంకల రామచంద్రారెడ్డి వెంకటరమణమ్మ దంపతులు వ్యవహా రిస్తున్నారు. 26వ తేదీన శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. చేబ్రోలు వసంతరావు విజయలక్ష్మీ దంపతులు కుమార్తె వీణ కుమారుడు వర్షవర్ధన్ ఉభయకర్తలుగా వ్యవ హారిం చనున్నారు. 27వ తేదీన మహాచండీ దేవిగా కొండ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహారించ నున్నారు. 28వ తేదీన శ్రీ మహాలక్ష్మీ దేవిగా సూరూం చిన్న వీరారెడ్డి రాజమ్మల జ్ఞాపకార్ధం కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి పద్మాదంపతులు మనుమడు విష్ణువర్ధన్‌రెడ్డి మనుమరాలు పవిత్ర అక్కల్‌రెడ్డి మాధవరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహారించనున్నారు. 29వ తేదీన శ్రీ సరస్వతి దేవిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. ఉయభకర్తలుగా కరకల నాగిరెడ్డి నాగేశ్వరమ్మ దంపతులు కుమారుడు మాలకొండారెడ్డి రమాదేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహారించనున్నారు. 30వ తేదీన శ్రీ దుర్గా దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం ఇవ్వనున్నారు. కర్నాటి వీరారెడ్డి శ్రీలత దంపతులు రఘురాంరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహారించనున్నారు. ఒకటవ తేదీన శ్రీ మహిషాసుర మర్ధిని దేవిగా ఉభయదాతలు గురుజాల సోదరులు వ్యవహారించనున్నారు. రెండవ తేదీన శ్రీ రాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా శ్రీ ఓంకారేశ్వర భక్త బృందం వ్యవహారించనున్నారు. ఉభయకర్తలుగా ఉన్న వారు ఆయా కార్యక్రమాలకు ఉభయకర్తలు ఉదయం 9గంటలకు సాయంత్రం 7 గంటలకు సాంప్రదాయ దుస్తులతో ఆలయానికి చేరుకోవాలని ఆలయ పాలకమండలి తెలియజేసింది.

## ప్రభుత్వ భూమిలో 20 అడుగుల లోతు నేల బావి

### - పట్టించుకోని రెవెన్యూ అధికారులు- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



**వెంకటాచలం,సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు 20 అడుగుల లోతు దారి పక్కన నేల బావి తవ్వడంతో, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఇడిమేపల్లి పంచాయితీలోనే జంగాలపల్లి గ్రామంలో 559 సర్వే నెంబర్లు (మందబైలు) గ్రామానికి చెందిన గుమ్మా పెంచలయ్య నేల బావిని తోవ్వారు.దారి పక్కన నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతం గ్రామస్తులు గేదలు మేపుతుంటారు అలాంటి ప్రదేశంలో నేల బావి తవ్వడం వల్ల నీటి కోసం గేదలు దాంట్లో దిగితే ఇక బయటికి వచ్చే పరిస్థితి లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికే గ్రావెల్ గుంటల్లో పడి పశువులు, అనేక మంది వ్యక్తులు మృత్యువాత పడి ఉన్నారు. ఇదే పంచాయతీలో ఆదివారము నాడు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి గ్రావిల్ గుంటలో పడి మృతి చెందిన సమయం లోనే సమీపంలో నేల బావి తొవ్వడంతో ఈ ప్రదేశంలో అలాంటి సంఘటనలు కూడా జరగవచ్చునని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూమి లో నేల బావి తవ్వుతున్నార అన్న విషయం పై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదన్నారు దీంతో ఆదివారం నాడు పూర్తి గా నేల బావి తవ్వేశారు దీంతో సోమవారం గ్రామస్తులు ఆర్డీవో కు ఫిర్యాదు చేశారు.నేల బావి పక్కనే ప్రభుత్వ భూమి కాలిగా ఉండటంతో దానిని బాగు చేసేందుకు ముందుగానే నేల బావి తవ్వారని గ్రామస్తులు తెలియజేశారు.వార్షా కాలం రావడంతో ఎక్కువగా అక్కడే పశువులు సంచరిస్తూ ఉంటాయి.ఈ బావి వల్ల చాలా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

**-విచారించి చర్యలు తీసుకుంటాం** ఆర్డీవో నాగ అనూష అనుమతులు లేకుండా నేల బావి తొవ్విన విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిపై విచారణ చేపట్టాలని తాసిల్దార్‌కు ఆదేశం ఇవ్వడం జరిగింద న్నారు.విచారణ జరిపి బాద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు.ప్రభుత్వ భూమిలో తవ్విన నేల బావి లో కూడా పూడ్చి వేస్తాం అని తెలియజేశారు.

## శ్రీ ఆర్యవైశ్య మహాలక్ష్మమ్మ సన్నిధిలో కలశస్థాపన





**బుచ్చి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ ఆర్యవైశ్య మహాలక్ష్మమ్మ అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రులలో భాగంగా అత్యంత భక్తి శ్రద్దల నడుమ కలశ స్దాపన చేశారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారుగా మహాలక్ష్మమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కటకం వెంకటసుబ్బయ్య, భార్య సుజాతమ్మ, పూలంగిసేవకు గంగి శెట్టి బాబులు భార్య సునంద వ్యవ హారించారు. అనంతరం ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్ర మాలను ఆలయఅద్యక్షులు బండారు వేణుగోపాల్ శ్రేష్ఠి,దేవస్దానం పాలకవర్గ సభ్యులు గౌరవ అద్యక్షులు సరాబు సీతయ్య, మొగళ్లూరి వెంకటశేషయ్య, తిరివీధి రాధాకృష్ణయ్య, అద్యక్షులు బండారు వేణుగోపాల్,ఉపాధ్యాక్షులు గాదంశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి సరాబు వెంకటనాగేశ్వరరావు, సహాయకార్యదర్శలు కూరపాటి శశికుమార్,బల్లాని వెంకటరామయ్య,కోశాధికారి అమర్తలూరు రాజారమేష్,ఉపకోశాధికారి సరాబునాగేంద్రప్రసాద్ ,కమీటి సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## విజయ డెయిరీ డైరెక్టర్‌గా నాగేశ్వరమ్మ ఏకగ్రీవ ఎన్నిక



**నెల్లూరు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త-విద్య :** నెల్లూరు విజయ డెయిరీ డైరెక్టర్ గా కొడవలూరు మండలం రేగడిచెలికకు చెందిన గుర్రం నాగేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన పోటీలో ప్రత్యర్థులు బరిలో లేకపోవడంతో నాగేశ్వరమ్మ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో విజయా డెయిరీ డైరెక్టర్ గా మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో పనిచేయడం ఆనందంగా ఉందని, పాడి రైతులకు మేలు చేసేలా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు లక్ష్మీ ప్రణతి ఎంపిక



**కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** కావలి పట్టణం, పుల్లారెడ్డి నగర్ లోని శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థిని కే లక్ష్మీప్రణతి ఆగస్టు 29, 30,31, తేదీల్లో ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన సీనియర్ బాలికల పురుషుల అంతర్ జిల్లాల పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రణతికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరు నాగేశ్వరరావు అభినందనలు తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎండి అల్తాఫ్, కరస్పాండెంట్ కోట సురేంద్ర రెడ్డిలు అభినందనలు తెలియజేసి. మాట్లాడారు. కే.లక్ష్మీ ప్రణతి సెప్టెంబరు 17 నుండి 23 వరకు చేవూరులోనే జరిగే కోచింగ్ క్యాంపుకి హాజరవుతారని తెలియజేశారు.24 నుండి తమిళనాడులోని దిండిగల్ లో జరిగే జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటుందని తెలియజేశారు. అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## లేడీ డాన్ అరుణ పై కొనసాగిన విచారణ



**కోవూరు, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని నాగులకట్ట కాలనీ వద్ద ఉన్న గిరిజనుల వద్ద ఇళ్ల పట్టాలు, ఇళ్లు కట్టిస్తానని చెప్పి 21 మంది దగ్గర 2.10 లక్షలు దండుకున్న లేడీ డాన్ నిడి గుంట అరుణపై సోమవారం కోవూరు సీఐ సుధా కర్‌రెడ్డి సుదీర్ఘ విచారణ చేపట్టారు. నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అరుణను సోమవారం కోవూరు పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు పెట్టిన కేసుపై కోవూరు సీఐ విచారణ చేపట్టారు.

## అక్రమణలతో దారి లేకుండా పోతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల



**రాపూరు, సెప్టంబరు22ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన సివికె ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెల్లే దారి అక్రమణలకు గురైపోతుంది. దీంతో కళాశాలలోకి ఎద్దైనా వాహనం వెల్లాలన్నా వెల్లే వీలు లేకుండ అక్రమణ దారులు కళశాల గేటును కూడా ఆక్రమించి వేస్తున్నారు. కళాశాలకు వేల్లే దారి విశాలంగా వుండాల్సి వుండగా ఇక్కడ దుకాణ దారులు గేటును అక్రమించి వేస్తున్నారు. దీంతో బయట గ్రామల నుండి ఎవరైనా వచ్చి వారి వాహానాలను పక్కన నిలిపితే కూడా దుకాణదారులు వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. కళాశలకు వెల్లే దారిని కాపాడాల్సిన కళాశాల సిబ్బంది, ప్రజలకు ఇబ్బందిగా వున్న అక్రమణలను తోలగించాల్సిన పంచాయితీ సిబ్బంది కాని ఈ అక్రమణలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు అక్రమణలు తోలగించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## కాకర్ల సహాకారంలో ఉచిత మోగా వైద్యశిబిరం



**సీతారామపురం సెప్టెంబర్ 22 ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్ సహాకారంతో సీతారామపురంలోని టిడిపి కార్యాలయం ఆవరణంలో నెల్లూ రులోని నారాయణ సూపర్ స్పెషాల్టీ హాస్పటల్ లోని వైద్య బృందం మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్యశిబిరాన్ని మారంరెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్ సోమన బోయిన రాజశేఖర్ దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ వైద్యశిబిరంలో 60 మంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యపరీక్షలు చేయించుకున్నారు వైద్య చికిత్సలు అవసరమైన వారికి నెల్లూరులోని నారాయణ సూపర్ స్పెషాల్టీ హాస్పటల్ నందు ఉచిత వైద్య చికిత్సలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో జనరనల్ సర్జన్ డాక్టర్ దీపిక, హై టెక్నిషయన్ జోత్స్న తదితరులు పాల్గోన్నారు.

## పినాకిని పార్క్‌ను సందర్శించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 22,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక రంగనాయకుల పేట ప్రాంతంలోని పినాకిని పార్క్‌ను సోమవారం సందర్శించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు.అనంతరం స్థానిక జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాం తంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్ చివరి దశ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. నిర్దేశించిన సమయంలోపు పనులను పూర్తిచేసే స్మార్ట్ స్ట్రీట్ బజార్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈరామ్మోహన్‌రావు, ఈ.ఈరహంతుజానీ, కప్పిరశ్రీనివాసు లు,శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పొందాలి - ఆరోగ్యంగా ఉండాలి : సిడిపిఒ



**ఆత్మకూరు ,సెప్టెంబరు22,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ హాస్పిటల్ ఆవరణలో అంగన్ వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆత్మకూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.కస్తూరీ పర్యవేక్షణలో సోమవారం పోషణ్‌మా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి షేక్ అస్మ, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, ఆత్మకూరు వార్డు కౌన్సిలర్ రమాదేవిలు హాజరయ్యారు. ఈసందర్భంగా సిడిపిఒ సునీలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చిన్నారుల ఆరోగ్యం, పౌష్టి కాహారం, శిశు సంరక్షణ , ఊబకాయం నివారణ తదితర విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో పోషణ్‌మా మాసోత్సవ కార్యక్రమాలను సెప్టెంబర్ 17నుండి అక్టోబర్ 16వరకు నిర్వహిస్తామన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు. చిన్నారుల్లో ఇటీవల ఊబకాయం సమస్య తీవ్రంగా ఉందని దాన్ని నివారించేందుకు చక్కెర పదార్థాలను ఎక్కువగా తినకుండా చూడాలని, నూనె వస్తువులు తగ్గించాలని తెలిపారు. గర్భవతులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న బియ్యం,పప్పు, బాలసంజీవిని కిట్, పాలు, గుడ్లు,బాలామృతం తదితరాలను గర్భవతులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాలని దాంతోపాటు ఆకు కూరలు, తక్కువ ఖర్చుతో మనకు దగ్గరలో దొరికే ఆహారాన్ని సమపాళ్ళలో తీసుకొని ఆరోగ్యాన్ని పొందాలన్నారు. తల్లి దండ్రు లు తమ పిల్లలకు బాల్యవివాహాలు చేయరాదన్నారు. అలా చేయడం వలన యువతులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోలేక, చిన్నారులకు పౌష్టికాహారం అందించ లేక నానా అవస్థలు పడుతు అనారోగ్యం పాలవుతుం దన్నారు. కావున తల్లిదండ్రులు ఈవిషయాలపై అవగాహన కలిగి తమ బిడ్డల ఆరోగ్యాన్ని , ఆనందాన్ని కాపాడాలని ఆమె కోరారు. చిన్నారుల, శిశువుల సంరక్షణలో తండ్రి పాత్ర ఎక్కువగా ఉండాలని ఆమె తెలిపారు. డాక్టర్ సల్మా మాట్లాడుతూ గర్భవతులు ప్రతినెల పరిక్షలు చేయించుకోవాలని, అదే విధంగా తమ చిన్నారులకు వేయించాల్సిన టీకాలను సమయం ప్రకారం వేయించాలన్నారు. పౌష్టికాహారాన్ని సరైన సమయంలో తీసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలన్నారు. టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రజల ఆరోగ్యం కొరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆసుపత్రుల ద్వారా ఎన్నో సౌకర్యాలను సమకూరుస్తుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, శిశువుల ఆరోగ్యం కొరకు ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టి ఆహారాన్ని, ఆసుపత్రులను ఏర్పాటు చేసి కృషి చేస్తుందని కావున అందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ పార్వతి అంగన్‌వాడీ కార్యకర్తలు పి.రాధ, టి.సునీత, డి.పద్మావతి,పి.సుధారాణి, జి.సుప్రజ, ఆర్.సుప్రజ, కె.రమణమ్మ, ఎస్.కె.హామీద, టి.దొరసానమ్మ, వి.నీలిమ , ఎఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, కిశోరబాలికలు, గర్భవతులు, బాలింతలు , చిన్నారులు పాల్గొన్నారు.

## గుర్రప్ప స్వామికి ప్రత్యేక పూజలు



**వింజమూరు, సెప్టెంబర్ 22, ప్రభాత వార్త** వింజమూరులోని నడిమూరు నందు వేంచేసియున్న శ్రీ గురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపు అమ్మ అమ్మవార్లకు శరన్నవరాత్రి ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గురువారెడ్డి ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే స్వామివారి ఆలయానికి చేరుకుని స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తీర్థప్రసాదములు సేకరించి పునీతులు అయ్యారు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పర్వత వర్ధినీ దేవిగా శ్రీపార్వతీ దేవి



కలిగిరి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త కలిగిరిలో వెలసిన శ్రీ పర్వత వర్ధినీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం భక్తులు శ్రీ పర్వత వర్ధినీ దేవి రూపంలో దర్శన మిచ్చింది. దేవీ నవ రాత్రులలో బాగంగా కలిగిరి మండలంలో దశరా మహోత్సవాలు కన్నుల పండుగలా జరుగుతున్నాయి .ఉదయం ప్రాత:కాలమందు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు,అలంకణ, పారాయణాలు మొదలగునవి వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత శ్రీకలిగిరమ్మ తల్లి ఆల యంలో కూడా దశరా మహోత్సవాలు అత్యంత వైబవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలను చూసేందుకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారు.

## పలు ఆలయాలలో శరన్నవరాత్రి వేడుకలు



**సీతారామపురం సెప్టెంబర్ 22 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం సీతారామపురం మండలంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్ధానం, బెస్త కాలనీ అంకాళమ్మ దేవాలయం, నారాయణమ్మ పేట వద్ద కనకదుర్గమ్మ దేవాలయం,ఘటిక సిద్దేశ్వరంలోని కనక దుర్గ సన్నిధిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బెస్తకాలనీలోని అంకాళమ్మ దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులు సందర్భంగా ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమీటి సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం అంకాళమ్మ దేవాలయాంలోని అమ్మవారికి సొసైటీ అద్యక్షులు సోమన బోయిన రాజశేకర్ కలశంను అందించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## సోమేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రులు ప్రారంభం




**అనంతసాగరం,సెప్టెంబరు22,ప్రభాతవార్త :** మండలంలోని సోమశిలలో వెలసియున్న శ్రీకామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రులు సోమవారం నుండి ప్రారంభమయ్యాయని ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ తెలిపారు. మొదటిరోజు శ్రీకామాక్షి సమేత అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈనవరాత్రుల మహోత్సవాలు అక్టోబర్ 2వ తేదీ వరకు 9రోజుల పాటు జరుగుతాయన్నారు. తొమ్మిది రోజులు నిత్యం అమ్మవారికి సహస్రనామార్చన, త్రిశత ఖడ్గమాల , విశేషమైన హారతులు సమర్పిస్తూ అమ్మవారికి విశిష్టమైన పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. ఈకార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కండలేరులో 51.712 టీయంసీల నీటిమట్టం



కండలేరుడ్యాం(రాపూరు),సెప్టంబరు22ప్రభాతవార్త మండలంలోని కండలేరు జళాశయంలో సోమవారం ఉదయం నాటికి జళాశయంలో 51.712 టీయంసీల నీటిమట్టం నమెదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 10000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 490 క్యూసెక్కులు, లో లేవల్ స్లూయిస్ ద్వారా 40 క్యూసెక్కుల చోప్పున మొత్తం 530 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## కోనలో దశరా ఉత్సవాలలో తొలిరోజు సౌభాగ్యలక్ష్మిగా ఆధిలక్ష్మి దేవి



**పెంచలకోన(రాపూరు),సెప్టంబరు22ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి పట్టమహిషి అయిన శ్రీ అధిలక్ష్మీ అమ్మవారికి నిర్వహిస్తున శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం కళశ స్ధాపనతో ప్రారంభమైనాయి. ఇందులో బాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి పట్టువస్త్రాల సమర్పణ, పూలాంగి సేవ నిర్వహించారు. అనంతరం శరన్నవరాత్రి ఉత్సవాలకు కలశ స్ధాపన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తికి పాలు,పెరుగు, నెయ్యి,తేనే, పంచదార, పలు రకాలైన సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం(అభిషేకం), నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి పూలాంగి సేవ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పద్మపీఠోత్సవం, ఆస్ధాన సేవ నిర్వహించారు. తదుపరి అమ్మవారికి సౌభాగ్యలక్ష్మి దేవి అలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి,వినోద్ స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, సాయి స్వామి, నాగరాజు స్వాములు,ఉభయకర్తలుగా గోనుపల్లి గ్రామానికి చెందిన లక్కాకుల నరసింహులు, లత, క్రిష్ణ ప్రసాద్, హిమబిందు, హైదరాబాదుకు చెందిన దేగా శ్రీనివాసుల రెడ్డి, మద్దెలమడుగుకు చెందిన పిట్టబోయిన చిరంజీవి, స్వరూపాలు వ్యవహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## మణిధ్వీప మహా సంస్ధానంలో ప్రారంభమైన దసరా ఉత్సవాలు



**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు22ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి అశ్రమంలోని మణిద్వీప మహా సంస్ధానంలో దేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం అంకురార్పణతో ప్రారంభమైనాయి. ఉదయం 5 గంటలకు గర్భాలయంలోని శ్రీ లలింతాభికా దేవి, శ్రీ మ హా లక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిలకు,శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రమణ్యేశ్వరల స్వాములకు అభిషేకాలు, సుప్రభాత సేవ నిర్వహించారు. ఉదయం 6.30కి వేదపారాయణం, శ్రీ మహా రుద్రాభిషేకం, శ్రీ లలిం తాభికా దేవి, శ్రీ మహా లక్ష్మీ దేవి, శ్రీ మహా సరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు అశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమ లార్చ నలు, మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. 9.30 నుండి మాధ్యాహ్నం 1 గంట వరకు అశ్రమంలోని యాగశాలలో శ్రీ మహా గణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ ఛండీ హోమం, నవగ్రహ శాంతిహోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హో మం, శ్రీ రుద్ర హోమం, శ్రీ మహా మృత్యం జయ హోమం, శ్రీ కార్త వీర్యా హోమం నిర్వహిం చా రు.సా యంత్రం 6.30కి మణి ద్వీప మహా సంస్ధానంలో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకు మార్చ న,రాత్రి అమ్మవారు భక్తులకు శ్రీ బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో కమల వాహనం(తామర),పై అశ్రమంలోని మాఢవీదులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని ముగ్గురమ్మలను దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతీ ఏర్పాట్లను ఆలయ నిర్వహకులు పులిపాటి విజయ్ భరత్, విజయ్ గోకుల్, సింధూ, సౌమ్య, తదితరులు పర్యవేక్షించారు.

## శ్రీ బాలత్రిపుర సుందరీ దేవిగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ



**వెపినాపి(రాపూరు), సెప్టంబరు22ప్రభాతవార్త** ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవికి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా సోమవారం రాపూరులో అమ్మవారికి శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారం నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం కళశ స్ధాపన సందర్భంగా గ్రామంలో కళశ ప్రదర్శన నిర్వహించారు. తదుపరి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక అభిషేకం, పూజలు, పూలాంగి సేవ నిర్వహించారు. సాయంత్రం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవికి శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్బంగా రాపూరులోని ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన, శ్రీ లలితా సహస్రనామార్చన, దేవి ఖడ్గమాల కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## తాళ్లూరు లో వైద్య శిబిరం



**బిట్రగుంట సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** బోగోలు మండలం తాళ్లూరు గ్రామం లో సోమవారం స్వస్త్ నారి శశ క్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ వైద్య ఆరోగ్య శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించడం జరిగిందని కోవూరుపల్లి ప్రాథమిక వైద్య శాఖధికారి రామకృష్ణ తెలిపారు. ఈ వైద్య శిబిరం లో వైద్య పరీక్షలు నిర్వహించి 115 మందికి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గర్భవతులకు పౌష్టికాహారం అందజేయడం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులకి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు .రక్త దానం, అవయవ దానం గురించి అవగాహన కల్పిం చడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాగులవరం వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ లక్కాకుల.మాధవరావు, ఇండ్ల.శ్రీనివాసులు, పులి. సుబ్బారావు, జయ రామయ్య ఐసిడిఎస్ సూపర్వైసర్ పి.సుప్రజ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది ప్రజలు పాల్గొనడం జరిగింది. బుధవారం ఈ ప్రత్యేక వైద్య శిబిరం జువ్వలదిన్నె గ్రామం నందు నిర్వహించడం జరుగుతుందని వైద్యశాకాధికారి రామకృష్ణ తెలిపారు.

## మన డబ్బులు - మన లెక్కలు అవగాహన ర్యాలీ




**కొడవలూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:**మండలంలోని ఉన్న సంఘమిత్ర కార్యాలయం నుండి వివో ఏలు, పొదుపు సభ్యులచే ఏపీఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఆమె తెలియజేశారు. అలాగే ప్రతి గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలను బ్యాంకుకు చెల్లింపు మిగిలిన బకాయిలు ఎంత ఉందో తెలుసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా పెద్ద ఎత్తున ర్యాలీ చేస్తూ తహసిల్దార్ కార్యాలయం కూడలి వరకు మన డబ్బులు మన లెక్కలు అంటూ మానవహారం చేశారు. ఎల్ సి సీసీ, సీసీలు, ఎఫ్ బి ఓ సీసీ, వివో ఎస్, సభ్యులు పాల్గొన్నారు.

## యూరియా అందుబాటులో ఉంది



**సీతారామపురం సెప్టెంబర్ 22 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని అయ్యావారిపల్లి రైతు సేవా కేంద్రంలో 18 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపీణి చేసేందుకు అందుబాటులో ఉందని సొసైటీ అద్యక్షలు సోమనబోయిన రాజశేఖర్‌రెడ్డి, సోమవారం అయ్యావారిపల్లి రైతు సేవా కేంద్రంలో యూరియా పంపీణి కార్యక్రమ ంలో ఆయన పాల్గోన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యూరియా కొరత నుండి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపీణి కార్యక్రమం చేపట్టిందని సీతారామపురంలోని రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.యూరియా కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు పట్టాదారు పాసుపుస్తు జరాక్సెలతో అయ్యావారిపల్లి రైతు సేవాకేంద్రాన్ని సంప్రదించాలన్నారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి .చెన్నారెడ్డి, టిడిపి మాజీ కన్వీనర్ ముత్తం శెట్టి చెన్నకేశవులు,టిడిపి సీనయర్‌నాయకులు పిన్ని బోయిన రమణయ్య,పోలంగారిపల్లి సర్పంచ్ ముత్తూరు వెంకటసుబ్బయ్య,తోట ఏడుకొండలు,అగ్రికల్చర్ అసిస్టెంట్ ఒంకారం భరత్ రైతులు పాల్గోన్నారు.

## ఆత్మకూరులో ప్రారంభమైన జ్వాలాముఖి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఆత్మకూరు,సెప్టెంబరు22,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని ఉత్తరబలిజవీధిలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఉదయం 6గంటలకఉ మంగళవాయిధ్యాలతో తోరబంధన, గణపతిపూజ, పుణ్యాహ వచనం,అఖండదీపారాధన, జ్వాలాముఖి అమ్మవారి మంగళస్నానం,విశేష అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. తొలిరోజు సాయంత్రం అమ్మవారిని స్వర్ణకవచాలాంకరంతో అలంకరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా బైసాని మధుసూధన్‌రావు-ఉషారాణి దంపతులు, బైసాని శ్రీనివాసులు-ద్వారకాసాయి,సుకుమార్, జ్వాలాపవన్‌తేజ, లాస్యలు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకులు పి.శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్ర మంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ఇందుకూరుపేటలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం



**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఇందుకూరుపేట నందు శ్రీ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ నందు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా పలు ఆరోగ్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఈ ఆరోగ్య శిబిరం ద్వారా పలు రకాల వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించడం జరిగింది, పలు వ్యాధులపై అవగాహన కలిగించడం జరిగింది. ఎన్‌సీడీ స్క్రీనింగ్ హెచ్‌బీ, బీపీ, షుగర్ మానిటరింగ్ చేయడం జరిగింది. వరల్డ్ రోజ్ డే(క్యాన్సర్ బాధితుల స్వాంతన దినం), సందర్భంగా క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు ఓరల్ స్క్రీనింగ్ బ్రెసస్ట స్క్రీనింగ్ సర్వికల్ స్క్రీనింగ్ పలు రకాల స్క్రీనింగ్స్ పై అవగాహన కలిగించడంతో పాటు కొన్ని స్క్రీనింగ్ చేయడం జరిగింది. పొగాకు ఉత్పత్తులు వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో ప్రజా ప్రతినిధులు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకరరావు, హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, హెల్త్ అసిస్టెంట్స్ మాధవ, సుధాకర్, సీహెచ్‌ఓలు నీలిమ, కమల విద్యాసారిక విజయరాణి, నందిని, మౌనిక, ఏఎన్‌ఎంలు కల్పవల్లి చంద్రకళ, మణెమ్మ, సుజాత, యానాదమ్మ, ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

నెల్లూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం 33/11 కేవీ వైఎంసీఏ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ దర్గామిట్ట ఫీడర్ నందు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఏపీఎస్ ఆర్టీసీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

## డిగ్రీ కళాశలలో రక్త గ్రూప్ నిర్ధారణ కార్యక్రమం




**ఉదయగిరి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ గ్రూపు-1, రిబ్బన్ క్లబ్ సొసైటీ ఆధ్వర్యలో రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ బ్లడ్ గ్రూపులను తెలుసుకున్నారు. బ్లడ్ గ్రూపు నిర్ధారణ ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఫ్రోగ్రాం ఆఫీసర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణంపల్లిలో స్వస్తి నారి స్వశక్త్ పరివార్ కార్యక్రమం




**ఉదయగిరి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని కృష్ణంపల్లిలో స్వస్తి నారి స్వశక్త్ పరివార్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య సంరక్షణ అందించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం తీసుకొచ్చిందన్నారు. మహిళలు కిషోర్ బాలికలకు స్క్రీనింగ్ రక్తపోటు మధుమేహం క్యాన్సర్ వంటి రోగులకు ముందస్తుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కూరగాయాల స్టాల్స్ నిర్వహించి వాటి గురించి విటమిన్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఆర్లపడియ కృష్ణంపల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొదుపు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి
## చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** పొదుపు సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ అన్నారు. మోప్మా ఆద్వర్యంలో బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కువద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను సందర్శించిన సందర్బంగా ఆమె మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో పొదుపు మహిళలు మరింత ముందుకు వెళ్లాలని సూచించారు. కోవూరు శాసనసబ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పొదుపు మహిళలకు పూర్తి స్దాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా మెప్మా పొదుపు సభ్యులకు సహకారం అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో మెప్మా అధికారులు అంకయ్య, నర్మద, కౌన్సిలర్ బెళ్ళం మల్లారెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## చక్కెర ఉప్పు వాడకం తగ్గిస్తే మెరుగైన ఆరోగ్యం
## డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డా. పద్మజ



**లింగసముద్రం(కందుకూరు), సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ప్రతి మనిషి తన ఆహారపు అలవాట్లలో చక్కెర ఉప్పు వినియోగం తగ్గిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని కందుకూరు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ పద్మజ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పి.రమేష్ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నూనె చక్కెర ఉప్పు పదార్థాల వినియోగం తగ్గించాలని తగిన మోతాదులో వాడితే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే ప్రతిరోజు అరగంట పాటు వ్యాయామం అలవాటుగా చేసుకోవాలని సూచనలు చేశారు. మహిళ బాగుంటే ఆ కుటుంబం బాగుంటుందని ప్రభుత్వ వైదేశాలలో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉన్నాయని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసరావు, పూరిమెట్ల గురునాథం, అడప రంగయ్య, జంపాల శివ, గాలంకి ప్రసాద్, కొట్టే వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తులసీరామ్ డాక్టర్ కళ్యాణ్ కుమార్ డాక్టర్ నాగమణి మరియు ఆప్తమాలిక ఆఫీసర్ చంద్రశేఖర్ డాక్టర్ విద్యావతి పాల్గొన్నారు

## శ్రీ కనకదుర్గ దేవి అలంకారంలో శ్రీ కనక దుర్గాదేవి



**కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** కావలి రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నందు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం శ్రీ కనకదుర్గాదేవి శ్రీ కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు పాగొండ మోహన స్వామి సహకారంతో గోనుగుంట భవాని ప్రసాద్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు కనువిందు కలిగించారు. ఉదయం నుండి అభిషేకాలు సాయంత్రం శ్రీ కనకదుర్గదేవి లలిత సహస్రనామార్చన, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర శతనామావళి తదితర కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఆలయ బాధ్యులు పల్లపు మోహన్ మరియు కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరిగింది అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణ అందర్నీ ఆకట్టుకోవడం జరిగింది.

## మోటర్ బైక్ పై పడి వ్యక్తి మృతి



కావలి, సెప్టెంబర్22, ప్రభాతవార్త: కావలి ముసునూరు బ్రహ్మంగారి గుడి వద్ద నివసిస్తున్న కొల్లిబోయిన దేవమని మోటార్ బైక్ పై పడి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు గుడ్లూరు మండలం, చిన్నలాట్రిప్ గ్రామంనకు చెందిన కొల్లిబోయిన దేవమని(32) సుమారు ఒక సంవత్సరం నుండి కావలి ముసునూరు లోని బ్రహ్మంగారిగుడి దగ్గర బాడుగ ఇల్లు తీసుకుని కాపురం ఉంటున్నట్లు తెలియజేశారు. దేవమని ఇళ్లకు నంబర్ల వేసే పనులు చేసుకుని జీవిస్తున్నట్లు తెలియజేశారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానము అయినట్లు తెలియజేశారు. ఆదివారం మధ్యాహ్నం దేవమని అతని స్నేహితులైన నవీన్, ఆంజనేయులు తో కలిసి తుమ్మలపెంట సముద్రం బీచ్ వద్దకు వెళ్ళి బాగా మద్యం సేవించినట్లు తెలియజేశారు. తిరిగి ఇంటికి వస్తూ కావలి రూరల్ మండలం మన్నంగిదిన్నె దగ్గర మోటార్ సైకిల్ పై నుండి పడిపోయినట్లు, దేవమనిని స్నేహితులిద్దరూ ఇంటికి తీసుకుని వచ్చినట్లు తెలియజేశారు. దేవమనికి వేకువజామున గురక ఎక్కువ అయ్యి, ఫిట్స్ లాగా రాగా దేవమని బార్య శ్రీవర్షిణి దేవమని స్నేహితులకు ఫోన్ చేయగా వారు రాగా వారితో కలిసి దేవమనిని శ్రీవర్షిణి కావలి గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. అక్కడి డాక్టర్ చూసి చనిపోయినట్లు తెలియజేయడం జరిగిందన్నారు. మృతుడి అమ్మ అయిన కొల్లిబోయిన లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త: కావలి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభం కావడం జరిగింది. ఈ సందర్భంగా కావలి పట్టణంలోని బృందావనం హోసింగ్ కాలనీ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు బొచ్చు వీరాస్వామి ఇంటి వర్ధ నుంచి వాసవి అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రములు, పూలు, పండ్లును ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు తో వాసవి అమ్మవారి ఆలయానికి మేళ తాళాలతో విచ్చేసి అమ్మవారికి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, ఆలయ కమిటీ శాశ్వత గౌరవ అధ్యక్షులు కందుకూరు వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, ఉప కోశాధికారి సివిసీ సత్యం మరియు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపీ సీనియర్ నాయకుడు నీ పరామర్శించిన బుర్రా



కందుకూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త: ఇటీవల వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు రేణమాల అయ్యన్న కోడలు అనారోగ్యంతో మృతి చెంది ఉన్న ఆ కుటుంబాన్ని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ గారు రోజు అయ్యన్న స్వగృహంలో కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబాన్ని ఓదార్చారు.

## ఓగూరులో రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమం

**కందుకూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** మండలంలోని చిన్న ఓగూరు అంగన్వాడీ సెంటర్ లో సూపర్వైజర్ యు. ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం మహా పోషణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యూట్రిషన్ కలిగిన పౌష్టికాహారంతోనే పిల్లలకు చక్కటి ఆరోగ్యమని తల్లులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సిటిఆర్ఐ న్యూట్రిషన్ సైంటిస్ట్ బి.నిహారిక, కార్యకర్తలు రమణమ్మ. మాలతీ. మాధవి. కళ్యాణి. సహాయకురాలు విజయ పాలుగోన్నారు

## కందుకూరు అంగన్వాడీలో పౌష్టికాహారం అవగాహన కార్యక్రమం






కందుకూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త: కందుకూరు పట్టణంలోని బషీర్ కాలనీ 2 అంగన్వాడీ కేంద్రం లో సూపర్వైజర్ ఎస్కే షకీలా బేగం సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు పౌష్టికాహారం గురించి తల్లులకు వంటల ప్రదర్శనల ద్వారా సూపర్వైజర్ షకీలా బేగం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు హసీనా, స్నేహలత, ఇర్ఫాన, మెరమ్మ పాల్గొన్నారు.

## శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో శ్రీ కలుగోళ శాంభవి దేవి




**కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** శ్రీ కలుగోల శాంభవి దేవి దేవస్థానం నందు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం శ్రీ కలుగోళ శాంభవి దేవి శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు కనువిందు కలిగించారు. ఉదయం నుండి అభిషేకాలు సాయంత్రం కలుగోళ శాంభవి దేవిలలిత సహస్రనామార్చన, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర శతనామావళి తదితర కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు వెంకట కృష్ణ మోహన్ లు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరిగింది అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. భయకర్తలుగా పొదిలి శశిభూషణ్, లక్ష్మి లు వ్యవహరించడం జరిగింది. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టడం జరిగింది.

## శ్రీ విష్ణాలయంలో రాజ్యలక్ష్మీ దేవి అలంకారం



కావలి, సెప్టెంబర్ 22, ప్రభాత వార్త: కావలి విష్ణాలయం శ్రీ లక్ష్మి కాంత స్వామి ఆలయం నందు శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్ల శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం శ్రీ రాజ్యలక్ష్మి దేవి శ్రీ రాజ్యలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు నారాయణం రామాచార్యులు అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి భక్తులకు కను విందు కలిగించారు. ఉదయం నుండి అభిషేకాలు సాయంత్రం ప్రత్యేక అర్చనలు, రాజ్యలక్ష్మి దేవికి లలిత సహస్రనామార్చన తదితర కా ర్యక్రమాలను చేపట్టడం జరిగిం ది. ఆలయ ఈవో అరవ రాధాకృ ష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు వెంకట కృష్ణ మోహన్ లు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరిగింది అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

## శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో శ్రీ దుర్గ భ్రమరాంబాదేవి



కావలి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త: కావలి శివాలయంలో శ్రీ దుర్గ భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము నందు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం శ్రీ దుర్గా భ్రమరాంబ దేవి బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శశిధర్ గురుకుల్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు కనువిందు కలిగించారు. ఉదయం నుండి అభిషేకాలు సాయంత్రం నిశాకాలార్చన, భ్రమరాంబా దేవికి లలిత సహస్రనామార్చన, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర శతనామావళి తదితర కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు వెంకట కృష్ణ మోహన్ లు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరిగింది అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.




## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

